# తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం | జాతీయ పత్రిక

యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 29 | మంగళవారం | 25-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/-

Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:29 | Tuesday | 25-8-2026 | Pages:08 | Cost:2/-



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## మాజీ మంత్రి కారుమూరికి 14 రోజుల రిమాండ్..

- మద్యం రవాణా కేసులో కారుమూరికి జ్యుడిషియల్ కస్టడీ
- 14 రోజుల రిమాండ్ విధించిన నాంపల్లి కోర్టు
- హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలింపు
- మద్యం రవాణా కేసులో ఈడీ అదుపులోకి తీసుకున్న వైనం
- ఆదివారం రాత్రి అరెస్ట్, సోమవారం కోర్టులో హాజరు
- గత ప్రభుత్వ మద్యం విధానంలో అక్రమాలపై దర్యాప్తు






## సాంస్కృతిక ఔన్నత్యాన్ని చాటండి

- ప్రపంచపటంలో భారత్ స్థాయిని పెంచండి
- ట్రెయినీ ఐఎఫ్ఎస్‌లకు ప్రధాని మోదీ పిలుపు
- డిజిటల్ సాంకేతికతను వాడుకోవాలని సూచన

న్యూఢిల్లీ: మన సాంస్కృతిక ఔన్నత్యాన్ని, సాంకేతికత, ఆవిష్కరణలతో కలగలిపి, ప్రపంచ పటంలో భారత్ స్థాయిని ఇనుమడింప జేయాలని ట్రెయినీ ఐఎఫ్ఎస్ (ఇండియన్ ఫారిన్ సర్వీస్)అధికారులకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. 2025 బ్యాచ్‌లోని 50 మంది ఐఎఫ్ఎస్ అధికారులు సోమవారం సేవాతీర్థ్ లో ప్రధాని మోదీని కలిశారు. యువ దౌత్యవేత్తలు దేశ గొప్ప నాగరికత, సాంకేతికత, ఆవిష్కరణలు, సమర్థవంతమైన సమాచార మార్పిడిని మిళితం చేస్తూ దేశ గౌరవాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. ప్రపంచ దేశాలతో భారత్ కొనసాగించే ఆర్థిక సంబంధాలకు ఉత్ప్రేరక ఏజెంట్లుగా వ్యవహరించాలని వారిని కోరారు.

- మిగతా 2వ పేజీలో

### ప్రభుత్వ ఆఫీసులు చుట్టూ తిరగాల్సిన పని లేకుండా..

## టెక్నాలజీతోనే సేవలు

### టెక్నాలజీతో ప్రభుత్వ సేవలు మరింత సులభతరం

- సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు డేటా ఇంటిగ్రేషన్ విధానం
- ఎల్‌నినో ప్రభావం.. పంటల దిగుబడిపై సమీక్ష
- డెంగీ, మలేరియా నివారణకు హాట్‌స్పాట్‌ల గుర్తింపు
- శాఖల్లో సమర్థత, సేవల నాణ్యత పెంచాలని సీఎం ఆదేశం



ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత సులభంగా, వేగంగా అందాలని, ఇందుకోసం ఏఐ అసిస్టెంట్, బ్లాక్ చెయిన్ వంటి అత్యాధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఏ ఒక్కరూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేని విధంగా పాలన ఉండాలని స్పష్టం చేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం పదేపదే వాటిని అప్‌లోడ్ చేసే పనిలేకుండా 'డేటా ఇంటిగ్రేషన్' విధానాన్ని అమలు చేయాలని సూచించారు. సోమవారం సచివాలయంలో ఆర్టీజీఎస్‌పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని శాఖలు తమ సమర్థతను పెంచుకుని, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

- మిగతా 2వ పేజీలో




## రాకెట్ల తయారీకి ఇస్రో గుడ్‌బై!

- ప్రైవేట్ సంస్థలకే కీలక బాధ్యతలు
- ఎస్ఎస్ఎల్‌వీ టెక్నాలజీ, ఉత్పత్తి హక్కులు ఇప్పటికే బదలాయింపు
- తదుపరి దశలో పీఎస్ఎల్‌వీ, ఎల్‌వీఎం-3 తయారీ కూడా..
- ఇకపై పరిశోధన, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపైనే ఇస్రో దృష్టి

## ఫీజు బకాయిల రగడ..

- హైదరాబాద్‌లో బీజేపీ నేత రాంచందర్ రావు 48 గంటల దీక్ష
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం బీజేపీ నేత రాంచందర్ రావు దీక్ష
- రూ. 15,000 కోట్ల బకాయిలతో 40 లక్షల విద్యార్థులకు నష్టమని ఆరోపణ
- రాంచందర్ రావుది రాజకీయ డ్రామా అని కొట్టిపారేసిన మంత్రి పొన్నం




## నాకు తెలుగు అర్థమవుతుంది

- ముసునూరులో పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాన్ని ఆవిష్కరించిన రాధాకృష్ణన్
- తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించిన రాధాకృష్ణన్
- నదుల అనుసంధానం వాస్తవ రూపం దాలుస్తుందని ఆశాభావం






## ఇది జెన్‌జీ యుగం

- ఫేస్‌బుక్, ట్విట్టర్‌లు పాతవైపోయాయి... అంతా ఇన్‌స్టాగ్రామ్‌లో నడుస్తోంది
- సాంకేతికతను ఉపయోగించుకోకపోతే అవుట్‌డేట్ అవుతారు
- రూ.100 కోట్లకు ఎకరం అమ్మి సంకలు గుద్దుకున్నారు... నేను రూ.260 కోట్లకు అమ్మా
- సోషల్ మీడియాను బీఆర్ఎస్ బాగా ఉపయోగిస్తోంది... మనం చెక్ పెట్టకపోతే ఎలా?
- మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో సమావేశంలో సీఎం రేవంత్ దిశానిర్దేశం


హైదరాబాద్: ఇది జెన్‌జీ యుగమని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఒడిసిపట్టుకుని వినియోగించుకోకపోతే కాలం చెల్లినవారవుతారని (అవుట్‌డేట్) ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'సోషల్ మీడియా విస్తృతంగా వ్యాపిస్తోంది. ఫేస్‌బుక్, ట్విట్టర్‌లు పాతవైపోయాయి. ఇప్పుడు యువత ఇన్‌స్టాగ్రాంలో హల్‌చల్ చేస్తోంది. మనం కూడా ఆ బాట పట్టాలి. ఇన్‌స్టాగ్రాం ఖాతాలు తెరిచి ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలను ప్రచారం చేయాలి' అని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు ఆయన దిశానిర్దేశం చేశారు. రేవంత్ సోమవారం విలేకరుల సమావేశం అనంతరం కాసేపు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో సమావేశమై తాజా రాజకీయ పరిణామాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. సోషల్ మీడియాను బీఆర్ఎస్ విస్తృతంగా వినియోగిస్తోందని, దీనికి చెక్ పెట్టేలా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా పనిచేయాలన్నారు. 'నాడు ఎకరం రూ.100 కోట్లకు అమ్మితేనే సంకలు గుద్దుకున్నారు. కానీ నేను ఎకరం రూ.260 కోట్లకు అమ్మా. రాష్ట్రంలో రియల్‌ఎస్టేట్ రంగం ఊపందుకుంటోంది. ఇటీవలి కాలంలో రియల్ కార్యకలాపాలు 18 శాతం పెరిగాయని నివేదికలు చెపుతున్నాయి. ఇవేవీ సోషల్‌మీడియాలో కనిపించవు. దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్ కోసం స్మార్ట్ కార్డులు తెచ్చాం.

- మిగతా 2వ పేజీలో

## ప్రభుత్వ భూముల పరిరక్షణే 22ఏ ప్రధాన లక్ష్యం

- 22ఏపై ప్రతిపక్షాలది దుష్ప్రచారమన్న మంత్రి పొంగులేటి
- ప్రజలు ఆందోళన చెందవద్దని సూచన
- నకిలీ పత్రాలతో భూకబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భారీగా భూ అక్రమాలు జరిగాయని ఆరోపణ
- రిజిస్ట్రేషన్లు పూర్తికాని వారికి వారాంతంలోగా ఫీజులు వాపసు చేస్తామని హామీ





## ఈవీఎంలపై అనుమానాలు వద్దు: ఎన్నికల కమిషనం

- ఈవీఎంలకు ఇంటర్నెట్ కనెక్షన్ ఉండదన్న సీఈసీ
- బ్లూటూత్, వైఫై వంటి వాటితో ఈవీఎంలను కనెక్ట్ చేయలేరన్న స్పష్టీకరణ
- 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపు

భారతదేశంలో ఎన్నికల నిర్వహణకు వినియోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)పై ఎలాంటి అపోహలు అవసరం లేదని, ఇవి ఇంటర్నెట్ లేదా ఇతర వైర్‌లెస్ సాంకేతికతతో అనుసంధానం కాబోవని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ స్పష్టం చేశారు. ఈవీఎంలు

- మిగతా 2వ పేజీలో

# ఇది జెన్‌జీ యుగం

(మొదటి పేజీ తరువాయి)

కానీ సంగారెడ్డిలో పంపిణీ చేసిన ఆ ఒక్క రోజే ప్రచారం జరిగింది. కానీ, ఆ తర్వాత అందరూ మర్చిపోయారు' అని చెప్పారు. ఎమ్మెల్యేలందరూ వారి కార్యక్రమాలతోపాటు రాష్ట్ర పార్టీ, ఏఐసీసీ కార్యక్రమాలను కూడా సోషల్ మీడియాలో పెట్టాలని, ఇందుకోసం ఎమ్మెల్యేల దగ్గర పనిచేసే సిబ్బందికి ఐ అండ్ పీఆర్ శాఖతో ఓరియంటేషన్ క్లాస్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సందర్భంగా మనందరం కలిసి పనిచేసినట్లే వచ్చే ఎన్నికల్లో కూడా పనిచేస్తే 100కు పైగా సీట్లు గెలుస్తామన్నారు. అలాగే, 22ఏ భూముల గురించి ఎవరూ మాట్లాడొద్దని. ఇది మన హయాంలోనే వచ్చిందా? కాదని, ఈ సమస్య బీఆర్ఎస్ హయాంలో కూడా ఉందని చెప్పారు. ఈ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలందరూ వివాదాల జోలికి వెళ్లకుండా నియోజకవర్గాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సీఎం రేవంత్ సూచించారు. తమ తమ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నిధులను గ్రీన్ చానల్ ద్వారా విడుదల చేస్తామని, వెంటనే ఆ పనుల మీద దృష్టి పెట్టాలని సూచించారు. వచ్చే నెల 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తామని, కార్యక్రమ నిర్వహణకు సంబంధించి విప్‌లు సభ్యులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, విప్‌లు ఆది శ్రీనివాస్, రామచంద్ర నాయక్, బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, వీర్లపల్లి శంకర్, ప్రేమ్ సాగర్ రావు, నవీన్ యాదవ్, మట్టా రాగమయి, మందుల సామేల్, వెడ్మ బొజ్జు, కోరం కనకయ్య, తోట లక్ష్మీకాంతరావు, రాందాస్ నాయక్, కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్, బత్తుల లక్ష్మారెడ్డి, మనోహర్ రెడ్డి, తెల్లం వెంకట్రావు, కె.ఆర్.నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మురళీ నాయక్, యశస్విని రెడ్డి, ఎంపీలు కడియం కావ్య, రఘువీర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలు పాల్గొన్నారు.

**ఏ ఒక్కరి కోసమో కాదు: భట్టి**

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ పదేళ్ల పాటు అధికారం లేకపోతే ఎన్ని అవమానాలు ఎదుర్కొన్నామో అందరికీ తెలుసునని డిప్యూటీ సీఎం భట్టి వ్యాఖ్యానించారు. అధికారం వచ్చిన తర్వాత కష్టపడుతున్నామని, దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, ఒకరిద్దరి ప్రయోజనాల కోసం పోరాటని, ప్రభుత్వాన్ని ఫణంగా పెట్టకోలేమని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలబెట్టేలా అందరూ పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

**క్రమశిక్షణ నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందే**

కొండా సుస్మిత వ్యవహారంపై సీఎం స్పందన

సాక్షి, హైదరాబాద్: మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత పటేల్ తనపై చేసిన ఆరోపణలు, విమర్శలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా స్పందించడానికి నిరాకరించారు. ఈ వివాదంపై విలేకరుల సమావేశంలో అడిగిన ఓ ప్రశ్నకు బదులిస్తూ అంశం టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ పరిధిలో ఉందని, కమిటీ తీసుకునే నిర్ణయాన్ని పార్టీ, తాము, అందరూ కట్టుబడి ఉండాల్సి ఉంటుందన్నారు. ఊహాజనిత అంశాలను ప్రస్తావించవద్దని మీడియాను కోరారు.

# ప్రభుత్వ ఆఫీసులు చుట్టూ తిరగాల్సిన పని లేకుండా.. టెక్నాలజీతోనే సేవలు

(మొదటి పేజీ తరువాయి)

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రాష్ట్రంలో వ్యవసాయ రంగం పరిస్థితిని అధికారులు సీఎంకు వివరించారు. ఈసారి పంటల దిగుబడి సాధారణం కన్నా 20 శాతం తగ్గే అవకాశం ఉందని అంచనా వేశారు. కృష్ణా డెల్టాకు సెప్టెంబర్ నెలాఖరు వరకు పట్టిసీమ ద్వారా నీరందించగలమని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం, ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు నీటి కొరత లేకుండా చూడాలన్నారు. సాగు ప్రారంభించని చోట్ల వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని ఆదేశించారు. రైతులకు పంపే క్రాప్ అలర్ట్‌పై తీసుకుంటున్న చర్యలను కూడా పర్యవేక్షించాలని, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రజారోగ్యంపై కూడా ముఖ్యమంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో డెంగీ, మలేరియా వ్యాధుల నివారణకు వ్యాధి ప్రబలుతున్న హాట్‌స్పాట్‌లను గుర్తించి, తక్షణ నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అయితే, గతేడాదితో పోలిస్తే ఈసారి డెంగీ కేసులు గణనీయంగా తగ్గాయని అధికారులు వివరించారు. గత ఏడాది ఇదే సమయానికి 1,361 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 401 కేసులు మాత్రమే నమోదైనట్టు తెలిపారు. రాష్ట్రాన్ని కార్బన్ న్యూట్రల్ లక్ష్యం వైపు నడిపించాలని సీఎం ఆకాంక్షించారు. ఇందుకోసం పునరుత్పాదక ఇంధన వనరులపై, ముఖ్యంగా సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటుపై దృష్టి సారించి, ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సూచించారు.

# సాంస్కృతిక ఔన్నత్యాన్ని చాటండి

(మొదటి పేజీ తరువాయి)

'మీరు పనిచేసే దేశాల్లో స్థానిక వర్గాలతో భారత్ సంబంధాలను లోతుగా పెంచేలా ప్రాథమిక స్థాయిలో అనుబంధాన్ని పెంపొందించుకోండి. సంప్రదాయ దౌత్య పరిధికి మించి విస్తరించి, ప్రజల స్థాయిలో సంబంధాలను నెలకొల్పుకునేందుకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. భారతీయ మిషన్లు కేవలం ప్రభుత్వాలు, సంస్థలతోనే కాకుండా ప్రజలతో కూడా అర్థవంతమైన సంబంధాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉంది'అని ప్రధాని మోదీ వారికి చెప్పారు. 'భారతీయ మిషన్లలో డిజిటల్ సాంకేతిక వినియోగాన్ని పెంచుకోవాల్సిన అవసరం కూడా ఎంతైనా ఉంది. ప్రభుత్వ సేవలు, ఇతర కాన్సులర్ సేవలను మరింత సులభంగా, వేగంగా అందించేందుకు సాంకేతికత ఉపయోగపడుతుంది. ప్రజలు ఏదైనా ఒక సంస్థతో సంప్రదింపులు జరిపేందుకు వెబ్‌సైట్ మొదటి ద్వారంగా ఉంటుంది'అని ప్రధాని పేర్కొన్నారు. మన నాగరికత, సాంస్కృతిక, భౌగోళిక విశిష్టతలను ప్రపంచానికి చాటిచెప్పడం ద్వారా దేశాన్ని మరింత ఆకర్షణీయమైన ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని ట్రెయినీలను ప్రధాని కోరారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువతలో మనదేశంపై ఆసక్తిని పెంచేందుకు 'భారత్‌ను తెలుసుకోండి'క్విజ్‌ను నదినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఇలాంటి కార్యక్రమాలను మరింత ఆకర్షణీయంగా మార్చడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గేమింగ్‌లను సాధనాలుగా వాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా ట్రెయినీ ఐఎఫ్ఎస్‌లు తమ శిక్షణ, భారత్ దర్శన్ నుంచి పొందిన అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు.

# మాజీ మంత్రి కారుమూరికి 14 రోజుల రిమాండ్..

ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, వైసీపీ నేత కారుమూరి నాగేశ్వరరావుకు నాంపల్లి కోర్టు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు సోమవారం ఉదయం ఆయన్ను హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం రవాణా విధానంలో చోటుచేసుకున్న అక్రమాలకు సంబంధించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆయన్ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. మద్యం రవాణా కేసులో విచారణ నిమిత్తం కారుమూరి నాగేశ్వరరావును ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. విచారణ అనంతరం ఆదివారం రాత్రి ఆయన్ను అరెస్ట్ చేశారు. అరెస్టుకు ముందు ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆ తర్వాత ఈడీ కార్యాలయానికి తరలించారు. సోమవారం ఉదయం కోర్టులో హాజరుపరిచారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, కారుమూరికి 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల అనంతరం, పోలీసులు కారుమూరి నాగేశ్వరరావును చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించారు. గత ఏపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం వ్యాపార కార్యకలాపాల్లో జరిగిన అవకతవకలపై ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఈ కేసులో కారుమూరి నాగేశ్వరరావును నిందితుడిగా పేర్కొన్నారు. ఆయన రిమాండ్‌తో ఈ కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది.

# నాకు తెలుగు అర్థమవుతుంది



ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గ పరిధిలోని ముసునూరులో నాన్-జీఎంఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాన్ని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ సీఎం చంద్రబాబుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించి సభలోని వారిని అలరించారు. తనకు తెలుగు అర్థమవుతుందని.. కానీ స్పష్టంగా మాట్లాడలేనని చెప్పారు. మన దేశంలో జనవరి 14న సంక్రాంతి పంటల పండుగను విభిన్న పేర్లతో కలిసికట్టుగా జరుపుకుంటామని పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణల్లో సంక్రాంతిగా, తమిళనాడులో పొంగల్‌గా, పంజాబ్‌లో లోహ్రీగా, అస్సాంలో బిహూగా పిలుచుకుంటామని గుర్తుచేశారు. దేశంలో 8 రాష్ట్రాల్లో 17,500 మంది రైతులు దాదాపు 40 వేల ఎకరాల్లో పాప్‌కార్న్ మొక్కజొన్నను పండించడం అభినందనీయమన్నారు. అమెరికా నుంచి పాప్‌కార్న్ దిగుమతి చేసుకోవడం మానేసి, మనమే అక్కడికి ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. రైతుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని చెప్పారు. ద్రోన్లను రైతులకు అద్దెకు ఇచ్చే పథకం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.1,200 కోట్లను మహిళా సంఘాలకు కేటాయించిందని తెలిపారు. మహానది నుంచి కావేరి నది వరకు నదుల అనుసంధానం కేవలం కలగానే మిగిలిపోదని, కొంత సమయం పట్టినా భవిష్యత్తులో తప్పకుండా వాస్తవ రూపం దాలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.


# ఫీజు బకాయిల రగడ..

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సోమవారం హైదరాబాద్‌లో 48 గంటల నిరాహార దీక్షను ప్రారంభించారు. దాదాపు రూ.15,000 కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వల్ల కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని, తద్వారా వారు ఉన్నత విద్యకు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, ఇదే విద్యార్థులు త్వరలో ప్రభుత్వాన్ని గద్దె దించుతారని ఆయన హెచ్చరించారు. విద్యార్థులపై రాహుల్ గాంధీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తెలంగాణకు వచ్చి బకాయిలు విడుదల కోసం చొరవ చూపాలని సవాల్ విసిరారు. రాంచందర్ రావు దీక్షపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే రాంచందర్ రావు ఈ తరహా డ్రామాలు ఆడుతున్నారని ఆయన విమర్శించారు. చేతనైతే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావాలని సవాల్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలను సైతం తమ ప్రభుత్వం ప్రస్తుతం చెల్లిస్తోందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు బ్యాంకుల ద్వారా అడ్వాన్స్‌గా ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయాన్ని కల్పిస్తామని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. అలాగే, సంక్షేమ హాస్టళ్లకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులను విడుదల చేస్తామని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఇటువంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలవుతోందా అని ఆయన ప్రశ్నించారు.

# ప్రభుత్వ భూముల పరిరక్షణే 22ఏ ప్రధాన లక్ష్యం

22ఏ నిషేధిత భూముల జాబితాపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని, ఈ విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో నిన్న నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కాపాడటంతో పాటు, చట్టబద్ధమైన ప్రైవేట్ ఆస్తులకు రక్షణ కల్పించడమే 22ఏ ప్రాథమిక ఉద్దేశమని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నకిలీ జీవోలు, మెమోలు, సర్టిఫికెట్లతో భారీ ఎత్తున భూదందాలు జరిగాయని మంత్రి ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం రికార్డులను ప్రక్షాళన చేస్తూ, ప్రభుత్వ భూములను కాపాడే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చారంటూ వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. భూదాన్, అసైన్డ్, ప్రభుత్వ భూములకు సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించిన వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మంత్రి కొన్ని ఉదాహరణలను ప్రస్తావించారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారంలో సర్వే నంబర్ 172లోని ప్రభుత్వ భూమిని, సర్వే నంబర్ 173గా చూపి అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో కేవలం రెండు ప్లాట్లు మాత్రమే నిషేధిత జాబితాలో ఉండాల్సి ఉండగా, గతంలో ముఖ్యమంత్రితో పాటు తన నివాసాలు ఉన్న మొత్తం 1280 ఎకరాలను 22ఏ కింద చేర్చారని, అనంతరం ఆ పొరపాటును సరిదిద్దామని పేర్కొన్నారు.

## ఈవీఎంలపై అనుమానాలు వద్దు: ఎన్నికల కమిషనం



అత్యంత సురక్షితమైనవని, వాటి విశ్వసనీయతపై ఎటువంటి అనుమానాలకు తావులేదని ఆయన పునరుద్ఘాటించారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో గల చారిత్రాత్మక కాల్విన్ తాలూక్దార్స్ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈవీఎంలను ఇంటర్నెట్, బ్లూటూత్ లేదా వైఫై వంటి పరికరాలతో అనుసంధానించడం అసాధ్యమని ఆయన వివరించారు. ఈ యంత్రాలను కేవలం ప్రభుత్వ రంగ సంస్థలే తయారు చేస్తాయని, దేశంలో ఎన్నికల ప్రక్రియ అత్యంత పారదర్శకమైన నిబంధనలకు అనుగుణంగా జరుగుతుందని వెల్లడించారు. భారత్‌లో సుమారు 100 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, ఇంతటి భారీ స్థాయిలో ఎన్నికలను నిర్వహించడం ఒక గురుతర బాధ్యత అని సీఈసీ పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో యువత క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల నిర్వహణ విధానం, ఈవీఎంల భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

# రాకెట్ల తయారీకి ఇస్రో గుడ్‌బై!

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లో కీలకమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇకపై రాకెట్, శాటిలైట్ల తయారీ వంటి కార్యకలాపాల నుంచి ఇస్రో క్రమంగా తప్పుకోనుంది. ఈ బాధ్యతలను ప్రైవేట్ అంతరిక్ష సంస్థలకు, ప్రభుత్వ రంగ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నారు. పరిశోధనా, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసే దిశగా ఇస్రో శాస్త్రీయ ప్రయోగాలు, ప్రత్యేక మిషన్లపై మరింత దృష్టిసారించే పరిస్థితి కనిపిస్తోంది. ఈ మార్పు ఇస్రోలో ఇప్పటికే ప్రారంభమైంది.

**సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి**

చిన్న తరహా ఉపగ్రహాలను ప్రయోగించే స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్వీ) సాంకేతికత, ఉత్పత్తి హక్కులను బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌కు బదిలీ చేశారు. ఆ తదుపరి దశలో భారత్‌కు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన పీఎస్ఎల్వీ, ఇస్రో బాహుబలి రాకెట్‌గా పేరుగాంచిన ఎల్వీఎం--3 రాకెట్ సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ప్రైవేట్ రంగానికి బదిలీచేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే, ఈసారి ప్రభుత్వ రంగ సంస్థలకు బదులుగా ప్రైవేట్ పరిశ్రమలకే అవకాశం కల్పించనున్నట్లుగా ఇన్‌స్పేస్ చైర్మన్ డాక్టర్ పవన్ గోయెంకా ఇటీవల తెలిపారు. ఇకపై ఇస్రో ఒక తయారీ సంస్థగా కాకుండా ప్రధాన పరిశోధన, అభివృద్ధి సంస్థగా పనిచేయనుంది. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ మిషన్లు, ప్రత్యేక ఉపగ్రహాలు, అధునాతన అంతరిక్ష మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టిసారించనుంది. ఒక సాంకేతికత అభివృద్ధి చెంది వాణిజ్యపరంగా వినియోగించేందుకు సిద్ధమైన తరువాత దాన్ని ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తామని గోయెంకా తెలిపారు. ఇప్పటివరకు ఇస్రోకు చెందిన 120 సాంకేతికతలను ప్రైవేట్ రంగానికి బదిలీ చేసినట్లుగా కూడా ఆయన వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఇస్రో తమిళనాడులో సుమారు వెయ్యి కోట్లతో నిర్మిస్తున్న కొత్త ప్రయోగ వేదిక నిర్వహణ బాధ్యతలను కూడా ప్రైవేట్ రంగానికి అప్పగించే ప్రయుత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన ఆపరేటర్‌ను రాబోయే నాలుగైదు నెలల్లో ఖరారు చేసే అవకాశముందని కూడా తెలిపారు.

**అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ పెంపే లక్ష్యం**

భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను ప్రస్తుతమున్న సుమారు 8 బిలియన్ డాలర్ల నుంచి 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే అంతరిక్ష సాంకేతికతను ఇతర రంగాల్లో విస్తృతంగా వినియోగించడం, అంతర్జాతీయ మార్కెట్‌లో భారత సంస్థల విస్తరణ కీలకమని గోయెంకా తెలిపారు. రక్షణశాఖ ఇప్పటికే ప్రైవేట్ సంస్థలకు 31 ఉపగ్రహాల తయారీకి ఆర్డర్ ఇచ్చిందని, ఇదే కార్యక్రమంలో భాగంగా మరో 21 ఉపగ్రహాలను ఇస్రో తయారు చేయనుందని ఆయన వివరించారు.






## సీసీ కెమెరాలతో పటిష్ఠ భద్రత

- నాగోల్‌లో 74 సీసీటీవీలను ప్రారంభించిన ట్రాఫిక్ డీసీపీ
- ప్రజల భాగస్వామ్యంతోనే నేర నియంత్రణ సాధ్యం
- 'నేను సైతం 2.0'లో భాగంగా కెమెరాల ఏర్పాటు



**తొలివెలుగు, నాగోల్:** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా చేపట్టిన 'నేను సైతం 2.0' కార్యక్రమంలో భాగంగా నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన 74 సీసీటీవీ కెమెరాలను బుధవారం ప్రారంభించారు. ఎల్‌బీనగర్ ట్రాఫిక్ డీసీపీ బి. శ్రీనివాసులు, నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ కెమెరాలను ప్రారంభించారు. కృషినగర్‌లోని పల్లవి డీబీఆర్ అపార్ట్‌మెంట్స్‌లో 30 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయగా, రాఘవేంద్రనగర్ కాలనీ, తట్టి అన్నారం డబుల్ బెడ్‌రూమ్, అన్నవరపు సత్యనారాయణ కాలనీల్లో మరో 44 కెమెరాలను ఏర్పాటు చేశారు. దీంతో మొత్తం 74 సీసీటీవీ కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ బి. శ్రీనివాసులు మాట్లాడుతూ.. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో 'నేను సైతం 2.0' కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 2,58,457 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో 81,183 కెమెరాలను అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు మరింత వేగంగా జరుగుతోందని తెలిపారు. నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపు, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీటీవీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణను మరింత పటిష్ఠంగా చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఏసీపీ బి. నవీన్‌రెడ్డి, ఎస్‌ఐలు పి. శివనాగ ప్రసాద్, ఉమ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాఘవేంద్రనగర్ కాలనీ, తట్టి అన్నారం డబుల్ బెడ్‌రూమ్, అన్నవరపు సత్యనారాయణ కాలనీ ప్రతినిధులు, అపార్ట్‌మెంట్ వాసులు డాక్టర్ విష్ణు, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, శ్రీరాములు, అంజనేయులు తదితరులు హాజరయ్యారు.

## వాహన ప్రేమికులకు 'స్టూడియో 44' రక్షణ

- చింతల్‌కుంట అండర్‌పాస్ వద్ద నూతన కార్ కేర్ సెంటర్ ప్రారంభం
- పీపీఎఫ్, సిరామిక్ కోటింగ్‌తో ప్రత్యేక సంరక్షణ సేవలు



**తొలివెలుగు, ఎల్‌బీనగర్:** వాహనాలను నూతన కాంతులతో మెరిపిస్తూ, వాటి అందాన్ని మరింత కాలం కాపాడేందుకు ఎల్‌బీనగర్‌లోని చింతల్‌కుంట చెక్‌పోస్ట్ అండర్‌పాస్ సమీపంలో 'స్టూడియో 44' పేరుతో ప్రీమియం కార్ కేర్ సెంటర్ సోమవారం ప్రారంభమైంది. నిర్వాహకులు వినీత్, అవినాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్ కేర్ స్టూడియోలో ఆధునిక వాహన సంరక్షణ సేవలను అందుబాటులోకి తెచ్చారు. వాహనాల పెయింట్ పాడవకుండా పెయింట్ ప్రొటెక్షన్ ఫిల్మ్ (పీపీఎఫ్), సిరామిక్ కోటింగ్ వంటి ప్రత్యేక సేవలను అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వాహనాల బాహ్య, అంతర్గత భాగాలకు ఎక్స్‌టీరియర్, ఇంటీరియర్ డీటైలింగ్‌తో పాటు డీప్ క్లీనింగ్, పెయింట్ కరెక్షన్, షోరూమ్ ఫినిషింగ్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అలాయ్ వీల్స్‌కు కూడా ప్రత్యేక సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వీల్స్ క్లీనింగ్, వీల్ అండ్ కాలిపర్ పెయింటింగ్, కర్బ్ డ్యామేజ్ రిపేర్, అలాయ్ ప్రొటెక్షన్ కోటింగ్ వంటి సేవలు ఒకే చోట అందిస్తున్నట్లు వెల్లడించారు. అధునాతన పరికరాలు, నాణ్యమైన ఉత్పత్తులు, నిపుణులైన టెక్నీషియన్ల సేవలతో వినియోగదారులకు మెరుగైన ఫినిషింగ్ అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని నిర్వాహకులు వినీత్, అవినాష్ తెలిపారు. వాహన యజమానులు తమ కార్ల సంరక్షణ కోసం ముందస్తు అపాయింట్‌మెంట్ తీసుకోవచ్చని, ఇందుకోసం 8179778159 నంబరును సంప్రదించాలని సూచించారు.



# ఇబ్రహీం మృతి తీరని లోటు: వేముల వీరేశం





- సీనియర్ జర్నలిస్టు ఎం.డి. ఇబ్రహీంకు ఘన నివాళి
- ఐదు దశాబ్దాల పాటు ఒకే పత్రికలో సేవలు అభినందనీయం
- కుటుంబానికి అండగా ఉంటానని ప్రభుత్వ విప్ హామీ

**తొలివెలుగు, రామన్నపేట:** సీనియర్ జర్నలిస్టు ఎం.డి. ఇబ్రహీం మృతి పాత్రికేయ రంగానికి తీరని లోటని నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం అన్నారు. సోమవారం రామన్నపేట మండల పాత్రికేయుల ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, ఇబ్రహీం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వేముల వీరేశం మాట్లాడుతూ.. ఎం.డి. ఇబ్రహీం ఐదు దశాబ్దాలకు పైగా ఒకే పత్రికలో పనిచేసి గొప్ప పాత్రికేయుడిగా గుర్తింపు పొందారని కొనియాడారు. సుదీర్ఘకాలం పాత్రికేయ రంగంలో కొనసాగినప్పటికీ ఎవరితోనూ విభేదాలు లేకుండా అందరితో ఆప్యాయంగా ఉంటూ విశేషమైన అభిమానాన్ని చూరగొన్నారని తెలిపారు.

### 2018 నుంచి సన్నిహిత అనుబంధం:

2018 నుంచి ఇబ్రహీంతో తనకు ఎంతో సన్నిహిత అనుబంధం ఉందని వేముల వీరేశం గుర్తుచేసుకున్నారు. పలు ప్రజా సమస్యలపై ఆయన తరచూ ఫోన్‌లో తనతో చర్చించేవారని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేసే నిబద్ధత కలిగిన పాత్రికేయుడని అన్నారు. ఆయన మృతి వ్యక్తిగతంగా కూడా తనను తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు.

### కుటుంబానికి అండగా ఉంటా:

ఇబ్రహీం కుటుంబానికి ఎల్లవేళలా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ప్రభుత్వ విప్ వేముల వీరేశం హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి అవసరమైన సమయంలో తన సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పున్న జగన్మోహన్, సిరిగిరెడ్డి మల్లారెడ్డి, ఎం.డి. జమీరుద్దీన్, గంగుల వెంకట రాజారెడ్డి, పూస బాలకిషన్, పోచబోయిన మల్లేశం, ఉట్కూరి నరసింహ, స్థానిక విలేకరులు పాల్గొని ఎం.డి. ఇబ్రహీంకు ఘనంగా నివాళులర్పించారు.

# సన్న వడ్ల బోనస్ రైతుకే చెందేలా..!

- పంట వివరాలు నమోదు చేసుకున్న వారికే లబ్ధి
- దళారుల అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు
- సెప్టెంబరు 10 వరకు డిజిటల్ క్రాప్ సర్వే

**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం):** వానాకాలం 2026-27 సీజన్‌లో ప్రభుత్వం ప్రకటించిన సన్న వడ్ల బోనస్ నిజమైన రైతులకు మాత్రమే అందేలా వ్యవసాయ శాఖ చర్యలను వేగవంతం చేసింది. రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసిన దళారులు, వ్యాపారులు కొనుగోలు కేంద్రాల్లో బోనస్ పొందకుండా కొత్త నిబంధనలు అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.;సన్న రకాల విత్తనాలు కొనుగోలు చేసే సమయంలోనే రైతుల వివరాలను నమోదు చేస్తున్నారు. విత్తన డీలర్ల వద్ద రైతుల పట్టాదారు పాస్‌బుక్ వివరాలు, సర్వే నంబర్, విత్తన రకం తదితర వివరాలను రికార్డు చేస్తున్నారు. దీంతో విత్తనం కొనుగోలు నుంచి పంట విక్రయం వరకు రైతు వివరాలను గుర్తించే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

### సెప్టెంబరు 10 వరకు డిజిటల్ క్రాప్ సర్వే:

రైతులు సాగు చేసిన పంటల వివరాలను డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా నమోదు చేస్తున్నారు. సర్వేయర్లు ప్రతి ఫామ్



ఫీల్డ్‌కు 20 మీటర్ల దూరంలోకి వెళ్లి డీసీఎస్ యాప్ ద్వారా సన్న, దొడ్డు రకాల వరి పంట వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ సెప్టెంబరు 10 వరకు కొనసాగుతుందని డీసీఎస్ ప్రైవేట్ సర్వేయర్ వేముల గణేష్ తెలిపారు.

### సెల్ఫ్ డిక్లరేషన్ తప్పనిసరి:

అగ్రికల్చర్ యూనివర్సిటీ లేదా ఇతర ప్రాంతాల నుంచి విత్తనాలు, నారు తెచ్చుకుని సన్న రకాల వరి సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలని ఏఈఓ రాజశేఖర్ తెలిపారు. రైతులు సరైన వివరాలు అందించాలని ఆయన సూచించారు. విత్తన డీలర్ల వద్ద నమోదు చేసిన వివరాలు, డిజిటల్ క్రాప్ సర్వే సమాచారం, రైతుల సెల్ఫ్ డిక్లరేషన్లను ఆన్‌లైన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో నమోదు చేయనున్నారు. అనంతరం పౌరసరఫరాల శాఖ ద్వారా వివరాలను క్రాస్ చెక్ చేసిన తర్వాతే అర్హులైన రైతులకు సన్న వడ్ల బోనస్ అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ విధానంతో దళారుల అక్రమాలకు అడ్డుకట్ట వేసి, ప్రభుత్వ ప్రయోజనం నిజమైన రైతులకే చేరేలా చర్యలు తీసుకుంటున్నారు.

## ఆంజనేయస్వామి ఆలయంలో అఖండ హరినామ సంకీర్తన

- రాజాపేట జై శ్రీమన్నారాయణ భక్త బృందానికి సత్కారం
- ఆలయ 70వ వార్షికోత్సవం సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమం

**తొలివెలుగు, రాజాపేట:** జనగామ జిల్లా బాణాపురం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది. ఆలయ 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'నాదబ్రహ్మ యజ్ఞం'లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రాజాపేటకు చెందిన జై శ్రీమన్నారాయణ భక్త బృందం పాల్గొని ఆధ్యాత్మిక గీతాలు, హరినామ సంకీర్తనలను ఆలపించింది. భక్తుల గానంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. అఖండ నామ సంకీర్తనతో భక్తులను అలరించిన రాజాపేట భక్త బృందాన్ని ఆలయ నిర్వాహకులు విజయ్‌కుమార్ బజాజ్ ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. భక్తి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న బృంద సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో భక్త బృందం ప్రతినిధులు నంగునూరి జగదాంబ, రేపాక భాగ్యలక్ష్మి, బోగ లత, పెంట రజిత, నాళ్ల పద్మ, పుష్పలత, మహేశ్వరి, చామకూర అరుణ తదితరులు పాల్గొన్నారు.





## మహమ్మద్ ఇబ్రహీం సేవలు చిరస్మరణీయం

- 51 ఏళ్ల పాత్రికేయ రంగానికి అంకిత సేవలకు శ్రద్ధాంజలి
- హాజరైన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్

**తొలివెలుగు, రామన్నపేట:** ఇటీవల మృతి చెందిన 'ఆంధ్రజ్యోతి' రామన్నపేట సీనియర్ విలేకరి మహమ్మద్ ఇబ్రహీంకు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం రామన్నపేట మండల కేంద్రంలో నిర్వహించిన సంతాప సభలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొని, ఇబ్రహీం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా అంజలి ఘటించారు. ఈ సందర్భంగా దైద రవీందర్ మాట్లాడుతూ.. మహమ్మద్ ఇబ్రహీం సుమారు 51 ఏళ్ల పాటు పాత్రికేయ రంగంలో కొనసాగుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. నిబద్ధత, నిజాయితీతో ఆయన చేసిన పాత్రికేయ సేవలు చిరస్మరణీయమని అన్నారు. సుదీర్ఘకాలం పాత్రికేయ వృత్తికి సేవలందించిన ఇబ్రహీం మృతి జర్నలిజం రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కలాన్ని ఆయుధంగా చేసుకుని పనిచేసిన ఆయన సేవలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గార్లపాటి రవీందర్‌రెడ్డి, స్థానిక విలేకరులు, వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు పాల్గొని మహమ్మద్ ఇబ్రహీం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## శివాలయ పునర్నిర్మాణంపై ప్రత్యేక సమావేశం

- నమిలలో గ్రామస్థులు, ప్రజాప్రతినిధుల భేటీ
- పనుల వేగవంతం, జమఖర్చులపై సుదీర్ఘ చర్చ

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం నమిల గ్రామంలోని పురాతన శివాలయ పునర్నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సర్పంచ్ పులి రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి గ్రామంలోని అన్ని కులాల పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వార్డు సభ్యులు, మహిళలు, గ్రామస్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ పునర్నిర్మాణ పనులకు ఇప్పటివరకు అందిన విరాళాలు, చేపట్టిన పనులకు జరిగిన ఖర్చుల వివరాలను గ్రామస్థుల సమక్షంలో చర్చించారు. ఆలయ నిర్మాణానికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత పాటించాలని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది. ఆలయ పునర్నిర్మాణంలో మిగిలి ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు తదుపరి కార్యాచరణపై గ్రామస్థులు సుదీర్ఘంగా చర్చించారు. నిర్మాణ పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. గ్రామస్థుల సహకారంతో శివాలయ పునర్నిర్మాణాన్ని పూర్తి చేసి ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు.






# మల్లారెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

- రైతాంగ పోరాటాలకు ఎనలేని సేవలు: జల్లెల పెంటయ్య
- రామన్నపేట సుభాష్ సెంటర్‌లో మల్లారెడ్డి చిత్రపటానికి నివాళులు

**తొలివెలుగు, రామన్నపేట:** రైతు సంఘం అఖిల భారత నాయకుడు, సీపీఎం సీనియర్ నాయకుడు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు, రైతాంగ పోరాటాలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జల్లెల పెంటయ్య మాట్లాడుతూ.. సారంపల్లి మల్లారెడ్డి తన జీవితాంతం రైతాంగ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన గొప్ప ప్రజా నాయకుడని కొనియాడారు. రైతుల సమస్యలపై పోరాటాలు చేస్తూ, వారి హక్కుల సాధన కోసం అంకితభావంతో పనిచేశారని తెలిపారు. ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడంలో, రైతాంగాన్ని ఐక్యం చేయడంలో మల్లారెడ్డి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను, పోరాట స్ఫూర్తిని కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. సారంపల్లి మల్లారెడ్డి మృతి సీపీఎంకు, రైతు సంఘానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పేర్కొంటూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శివర్గ సభ్యులు బోయిని ఆనంద్, కందుల హనుమంతు, కల్లూరి నగేష్, మండల నాయకులు తొలుపునూరి శ్రీనివాస్, నీల ఐలయ్య, మునికుంట్ల లెనిన్, శానగొండ వెంకటేశ్వర్లు, అప్పం సురేందర్, మేడి ముకుంద, అక్కెనపల్లి వీరయ్య, బోళ్ల వెంకన్న, గుణగంటి మల్లేష్, జగన్‌రెడ్డి, రసాల రమేష్, కల్లూరి జంగయ్య, వల్లమాళ్ల రమేష్, తుర్కపల్లి నరేష్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# నర్సింగ్ ఆఫీసర్లకు కనీస వేతనం రూ.40 వేలు ఇవ్వాలి

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ వినతి
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ



**తొలివెలుగు, ఎల్‌బీనగర్:** ప్రైవేట్ ఆసుపత్రులు, మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్‌లో పనిచేస్తున్న నర్సింగ్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింగ్ ఆఫీసర్లు తమ ప్రధాన డిమాండ్లను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న నర్సింగ్ ఆఫీసర్లకు నెలకు కనీసం రూ.40 వేల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అనేక ప్రైవేట్ ఆసుపత్రుల్లో తక్కువ వేతనాలతో ఎక్కువ గంటలు పనిచేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నర్సింగ్ ఆఫీసర్‌కు రూ.5 లక్షల ఇన్సూరెన్స్ పాలసీ కల్పించాలని, విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందితే కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. రోజుకు 10 నుంచి 12 గంటల పాటు విధులు నిర్వహిస్తున్న నర్సింగ్ ఆఫీసర్లకు పీఎఫ్, ఈఎస్ఐ, వారాంతపు సెలవులు, ఓవర్‌టైమ్ భత్యం వంటి సౌకర్యాలను తప్పనిసరిగా కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే నిమ్స్‌లో చేపట్టే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలో జీఎన్ఎం అర్హత కలిగిన అభ్యర్థులకు కూడా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నర్సింగ్ ఆఫీసర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్య సలహాదారు గురు, రాష్ట్ర కోఆర్డినేటర్ రమేష్, రాష్ట్ర సహాయ కోశాధికారి మధు, రాష్ట్ర సహాయ ప్రచార కార్యదర్శి లత, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ నవీన్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా కోశాధికారి మనీషా, నాగర్‌కర్నూలు జిల్లా అధ్యక్షురాలు శిరీష తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా రెండోసారి ముస్కూరి నరసింహ

- ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక
- ముఖ్య అతిథిగా హాజరైన మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ మదన్‌మోహన్

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** పురపాలక కేంద్రంలో సోమవారం లయన్స్ క్లబ్ పోచంపల్లి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ మదన్‌మోహన్ హాజరై నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కొనసాగుతున్న కమిటీని సభ్యుల ఏకగ్రీవ ఆమోదంతో మరోసారి కొనసాగించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో సభ్యులు భాగస్వాములు కావాలని సూచించారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా లయన్ ముస్కూరి నరసింహను రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బండారు లక్ష్మయ్య, రామిడి యాదిరెడ్డిలను ఎంపిక చేశారు. ప్రధాన కార్యదర్శిగా రాపోలు వేణు, సహాయ కార్యదర్శిగా దుద్యాల రామకృష్ణ, కోశాధికారిగా కర్నాటి నరసింహ బాధ్యతలు చేపట్టనున్నారు. జీఎస్టీ కోఆర్డినేటర్‌గా గంజి బాలరాజ్, జీఎంటీ కోఆర్డినేటర్‌గా మంగళపల్లి రమేష్, జీఈటీ కోఆర్డినేటర్‌గా రామిడి నరేందర్‌రెడ్డి, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్లుగా రచ్చ భాస్కర్, కూరపాటి స్వామిని నియమించారు. ఏవోగా ఏలే హరిశంకర్‌ను ఎన్నుకున్నారు.



# 22 ఏ జీవో అడ్డం పెట్టుకొని పేదల భూములతో చెలగాటం

- త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు
- పేదలు, మధ్యతరగతి ప్రజల భూములను నిషేధిత జాబితాలో పెట్టొద్దు
- ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి



**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం):** 22 ఏ జీవోను అడ్డం పెట్టుకుని పేదలు, మధ్యతరగతి ప్రజల భూములతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆలేరు మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి ఆరోపించారు. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్ర ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి, 1908 నాటి చట్టంలోని సెక్షన్ 22ఏ నిబంధనలను ఉపయోగించి ప్రభుత్వ, ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికే పేదలు, మధ్యతరగతి ప్రజలు తమ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారని, ఇప్పుడు ఈ జీవో పేరుతో వారి ఆస్తులను కొనుగోలు, విక్రయాలు చేయకుండా అడ్డుకోవడం ద్వారా వారి జీవితాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సునీత మహేందర్‌రెడ్డి ఆరోపించారు. యూరియా సక్రమంగా అందడం లేదని, నాణ్యమైన విత్తనాలు లేవని, సమయానికి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కావడం లేదని పేర్కొన్నారు. రైతుబంధు, రైతు బీమా వంటి పథకాల అమలుపై కూడా ప్రశ్నించారు. ఆటో కార్మికులు రోజంతా కష్టపడినా సరైన ఆదాయం లేక ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. మాదకద్రవ్యాల వినియోగం పెరగడం వల్ల నేరాల సంఖ్య అధికమవుతోందని, వాటిని అరికట్టేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించకుండా ప్రతిపక్ష నాయకులపై కేసులు నమోదు చేస్తూ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు హరీశ్‌రావు, కేటీఆర్‌లపై కేసులు పెట్టి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఎన్ని పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసిందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమం కంటే భూముల వివరాలు సేకరించడం, భూకబ్జాలు, భూ దందాలు, సెటిల్‌మెంట్లు, ఇసుక, మట్టి దోపిడీలపైనే కాంగ్రెస్ నాయకుల దృష్టి ఉందని ఆరోపించారు. ఆలేరు నియోజకవర్గంలో సుమారు వెయ్యి ఎకరాల వరకు భూములను ప్రొహిబిటెడ్ లిస్టులో చేర్చారని, వెంటనే 22ఏ నిబంధనల అమలుపై పునరాలోచించి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్ నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి, సర్పంచ్ ధనలక్ష్మి చందర్‌గౌడ్, సోలిపురం అరుణ, కోర బిక్షపతి, యాస ఇంద్రారెడ్డి, నాతి రాజు, రంగ సత్యనారాయణ, హైమద్ తదితరులు పాల్గొన్నారు.



# 'ఖేలో ఇండియా సంవాద్'ను విజయవంతం చేయాలి

- ఈనెల 27న ప్రధాని మోదీ వర్చువల్ ప్రసంగం
- విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలి: ప్రిన్సిపల్ సురేష్‌రెడ్డి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 27న నిర్వహించనున్న 'ఖేలో ఇండియా సంవాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భూదాన్ పోచంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి. సురేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

**27న ప్రధాని వర్చువల్ ప్రసంగం:**

ఆగస్టు 27న ఉదయం 10 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా ఉన్న క్రీడాకారులు, యువతతో వర్చువల్ విధానంలో సంభాషించనున్నారని ప్రిన్సిపల్ తెలిపారు. క్రీడల ప్రాధాన్యత, యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం వంటి అంశాలపై ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

**విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి:**

కళాశాల వేదికపై 'ఖేలో ఇండియా సంవాద్' కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేలా ఏర్పాట్లు చేసినట్లు సురేష్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులందరూ కార్యక్రమంలో పాల్గొని ప్రధాని ప్రసంగాన్ని వీక్షించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అధ్యాపకులు రాజేశ్వరమ్మ, రేణుక, దేవి, స్వాతి, చందన, అనురాధ, శివశంకర్, సంతోష్, కుమార్, వెంకట్‌రెడ్డి, మురళీకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు సాయివర్ధన్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.




# సౌత్ జోన్ క్రీడల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

- విజేతలకు ప్రిన్సిపాల్ శ్వేత అభినందనలు
- 1500 మీటర్ల పరుగులో శ్రీనాథ్‌కు ప్రథమ బహుమతి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** హైదరాబాద్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్ జోన్ అండర్-14, అండర్-18 క్రీడా పోటీల్లో దేశ్‌ముఖిలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల మలక్‌పేట్, కార్వాన్ విభాగాలకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను సోమవారం పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ శ్వేత ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు. అండర్-18 విభాగంలో జరిగిన 1500 మీటర్ల పరుగుపందెంలో శ్రీనాథ్ ప్రథమ బహుమతి సాధించగా, వరుణ్ ద్వితీయ స్థానంలో నిలిచారు. 400 మీటర్ల షాట్‌పుట్ విభాగంలో సురేందర్ ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. అండర్-14 విభాగంలో జరిగిన 600 మీటర్ల పరుగుపందెంలో సంతోష్ ద్వితీయ బహుమతి సాధించారు. క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్వేత ప్రత్యేకంగా అభినందించారు. రానున్న రోజుల్లో నిర్వహించే క్రీడా పోటీల్లోనూ విద్యార్థులు మరింత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏటీపీ రవి, డీడబ్ల్యూ జ్యోత్స్న, పీడీలు సతీష్, హేమంత్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 4 దరఖాస్తులు





- మూడు దరఖాస్తులు రెవెన్యూ శాఖకు సంబంధించినవే
- పూర్తిస్థాయి అధికారుల హాజరు..
- నోడల్ అధికారి నాగవేణి ఆధ్వర్యంలో నిర్వహణ

**తొలివెలుగు, రాజాపేట:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజాపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలస్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. నోడల్ అధికారి కూతల నాగవేణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మండలస్థాయి వివిధ శాఖల అధికారులు ఉదయం 10 గంటలకు హాజరయ్యారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వివిధ గ్రామాలకు చెందిన ప్రజల నుంచి మొత్తం నాలుగు దరఖాస్తులు అందాయి. వీటిలో మూడు దరఖాస్తులు రెవెన్యూ శాఖకు సంబంధించినవి కాగా, మరో దరఖాస్తు మండల పరిషత్ కార్యాలయానికి (ఎంపీఓ) సంబంధించినదిగా అధికారులు తెలిపారు. అందిన దరఖాస్తులను వెంటనే సంబంధిత శాఖలకు పంపించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నోడల్ అధికారి నాగవేణి తెలిపారు. ప్రజావాణికి వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు, అర్జీ స్వీకరించినట్లు ఫిర్యాదుదారులకు ధ్రువీకరణ అందించారు. సంబంధిత దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఫిర్యాదుదారులకు ఫోన్ ద్వారా తెలియజేసేలా ఏర్పాట్లు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హెల్ప్‌డెస్క్ వద్ద అవసరమైన సౌకర్యాలను కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ చందా రమేష్, తహసీల్దార్ గోలి రవికిరణ్, వ్యవసాయ అధికారి పద్మజ, విద్యుత్ ఏఈ చంద్రశేఖర్, వైద్యశాఖకు చెందిన బీకూ నాయక్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సందీప్‌రెడ్డి, పశువైద్యాధికారి శివరామకృష్ణ, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ వివేకానంద్, ఈజీఎస్ కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు. కార్యాలయ సిబ్బంది, హెల్ప్‌డెస్క్ సిబ్బంది ప్రజావాణి నిర్వహణలో సహకరించారు.

# ఉద్యోగాలు భర్తీ చేయకుండా రిజర్వేషన్లకు ఎసరు: మల్లికార్జున ఖర్గే

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా, లక్షలాది పోస్టులను ఖాళీగా ఉంచడం ద్వారా రిజర్వేషన్లను పరోక్షంగా నిర్వీర్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం లేకుండానే రిజర్వేషన్లను అంతం చేసేందుకు ప్రభుత్వం ఈ మార్గాన్ని ఎంచుకుందని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఖర్గే కొన్ని కీలక గణాంకాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, 2015లో కేంద్ర ప్రభుత్వంలో 4.21 లక్షల పోస్టులు ఖాళీగా ఉండగా, 2024 నాటికి ఆ సంఖ్య 8.24 లక్షలకు చేరింది. ప్రస్తుతం రైల్వే శాఖలో 2.40 లక్షలు, రక్షణ శాఖలో 2.41 లక్షలు, హోం మంత్రిత్వ శాఖలో 1.10 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, శాశ్వత ఉద్యోగాలను కాంట్రాక్టు ఉద్యోగాలుగా మార్చడం ద్వారా రిజర్వేషన్ ఫలాలను దెబ్బతీస్తున్నారని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలలో 5.1 లక్షల శాశ్వత ఉద్యోగాలను తొలగించారని, అదే సమయంలో కాంట్రాక్టు కార్మికుల వాటా 19 శాతం నుంచి 49 శాతానికి పెరిగిందని వివరించారు. "రాజ్యాంగాన్ని సవరించాల్సిన అవసరం లేదు... రిజర్వేషన్లు ఉన్న ఉద్యోగాలను తొలగిస్తే చాలు" అంటూ ఆయన తన పోస్టులో ప్రభుత్వాన్ని ఎండగట్టారు.



## లింగన్న గౌడ్‌ను పరామర్శించిన అజ్మీర శ్యాం నాయక్

- త్వరగా కోలుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆకాంక్ష
- పాల్గొన్న పలువురు నేతలు, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

**తొలివెలుగు, జన్నారం:** ఇటీవల కంటి శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జన్నారం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గాజుల లింగన్నగౌడ్‌ను ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అజ్మీర శ్యాం నాయక్ సోమవారం పరామర్శించారు. ఆయన నివాసానికి వెళ్లిన శ్యాం నాయక్ లింగన్నగౌడ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి విధుల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా లింగన్నగౌడ్ కుటుంబ సభ్యులతోనూ మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సదర్‌మట్ సాధన సమితి అధ్యక్షుడు హపావత్ రాజేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు సిటీమల భరత్‌కుమార్, బీఆర్ఎస్ నాయకుడు రాజేష్ యాదవ్, ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు చిలువేరు నర్సయ్య, ప్రధాన కార్యదర్శి జాడి వెంకట్, కోశాధికారి శీల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీం కుటుంబానికి టీయూడబ్ల్యూజే అభయం

- చిత్రపటానికి నివాళులర్పించిన ప్రభుత్వ విప్ వేముల వీరేశం
- మీడియా అకాడమీ ద్వారా రూ.లక్ష సాయం.. సతీమణికి ఐదేళ్లపాటు నెలకు రూ.3 వేల పెన్షన్




**తొలివెలుగు, రామన్నపేట :** ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సీనియర్ జర్నలిస్టు ఎం.డి. ఇబ్రహీం సంతాప సభను సోమవారం రామన్నపేట మండల పాత్రికేయుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరై ఇబ్రహీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు వెలిమినేటి జహంగీర్ మాట్లాడుతూ ఇబ్రహీం అకాల మృతి పత్రికారంగానికి, యూనియన్‌కు తీరని లోటని అన్నారు. సుమారు ఐదు దశాబ్దాలపాటు ఒకే సంస్థలో కొనసాగుతూ జర్నలిజంలో నైతిక విలువలను కాపాడేందుకు ఆయన కృషి చేశారని గుర్తుచేశారు. జర్నలిజంలో నైతిక విలువలు పడిపోతుండటంపై ఇబ్రహీం తరచూ ఆందోళన వ్యక్తం చేసేవారని తెలిపారు. కుటుంబానికి ఆర్థిక భరోసా: టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ సూచన మేరకు ఇబ్రహీం కుటుంబానికి మీడియా అకాడమీ ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం అందేలా యూనియన్ తరఫున కృషి చేస్తామని జహంగీర్ తెలిపారు. అలాగే ఇబ్రహీం సతీమణికి నెలకు రూ.3 వేల చొప్పున ఐదేళ్లపాటు పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు కే. శశిధర్ రెడ్డి, జిల్లా నాయకుడు ఎం.డి. ఖుర్షీద్ పాషా, రామన్నపేట మండల పాత్రికేయులు, ఇబ్రహీం కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన ఆలేరు రెవెన్యూ అధికారులు

- పట్టా మార్పిడికి రూ.14 వేల లంచం.. ఆర్ఐ, వీఆర్ఓ అరెస్ట్
- రైతు ఫిర్యాదుతో తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

**తొలివెలుగు, ఆలేరు :** పట్టా మార్పిడి కోసం రైతు నుంచి రూ.14 వేల లంచం తీసుకుంటూ ఆలేరు రెవెన్యూ శాఖకు చెందిన ఆర్ఐ, వీఆర్ఓ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ ఘటన రెవెన్యూ వర్గాల్లో కలకలం రేపింది. ధర్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బుడిగె మహేష్ తండ్రి ఉప్పలయ్య మృతి చెందడంతో ఆయన పేరిట ఉన్న భూమిని తన పేరుపైకి మార్చుకునేందుకు (మ్యూటేషన్) రెవెన్యూ అధికారులను సంప్రదించాడు. ఈ పనికి ఆర్ఐ పూర్ణచందర్‌రావు రూ.20 వేల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. చివరకు రూ.14 వేలకు ఒప్పందం కుదిరినట్లు ఏసీబీ అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. లంచం ఇవ్వడం ఇష్టం లేని మహేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఫిర్యాదు మేరకు అధికారులు పక్కా ప్రణాళికతో వల పన్నారు. సోమవారం బాధితుడు ఇచ్చిన రూ.14 వేల లంచం నగదును కొలనుపాక గ్రామ పాలనాధికారి (వీఆర్ఓ) అహ్మద్ స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం డిమాండ్ చేసిన ఆర్ఐ పూర్ణచందర్‌రావుతో పాటు నగదు స్వీకరించిన వీఆర్ఓ అహ్మద్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయంలోని సంబంధిత రికార్డులను పరిశీలించిన అధికారులు ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# హెజెలోలో రియాక్టర్ పేలుడు.. చికిత్స పొందుతూ మరొకరి మృతి

- మూడుకు చేరిన మృతుల సంఖ్య
- మృతుడి కుటుంబానికి రూ.2.80 కోట్ల పరిహారం
- మరో ఏడుగురికి చికిత్స.. ఒకరి పరిస్థితి విషమం

**తొలివెలుగు, పోచంపల్లి:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెం సమీపంలోని హెజెలో లేబరేటరీస్‌లో ఇటీవల జరిగిన రియాక్టర్ పేలుడు ఘటనలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సూర్యాపేట జిల్లా మునగాల మండలానికి చెందిన రణబోతు రాజశేఖర్‌రెడ్డి (38) సోమవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు చౌటుప్పల్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. సతీష్‌రెడ్డి తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో నల్గొండ జిల్లాకు చెందిన ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ చెన్ను నాగిరెడ్డి (31), ఖమ్మం జిల్లాకు చెందిన సీనియర్ కెమిస్ట్ నాగనబోయిన నరేష్‌కుమార్ (29) అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన రాజశేఖర్‌రెడ్డి చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఈ ఘటనలో మృతుల సంఖ్య మూడుకు చేరింది.

**కుటుంబానికి రూ.2.80 కోట్ల పరిహారం:**

రాజశేఖర్‌రెడ్డి కుటుంబానికి కూడా గతంలో మృతి చెందిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు ఇచ్చిన విధంగానే రూ.2.80 కోట్ల పరిహారం అందించేందుకు పరిశ్రమ యాజమాన్యం అంగీకరించినట్లు సీఐ తెలిపారు. కాగా, ఖమ్మం జిల్లాకు చెందిన విధుల చెన్నకేశవులు (38) పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని పేర్కొన్నారు. ప్రమాదంలో గాయపడిన మరో ఏడుగురు




వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. ఇదే పరిశ్రమలో గత నెలలో రియాక్టర్ వద్ద జరిగిన మరో ప్రమాదంలో పరిశ్రమ ఏజీఎం వెంకటకృష్ణారెడ్డి (41) మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో హెజెలో పరిశ్రమలో నెలన్నర రోజుల వ్యవధిలో జరిగిన రెండు ప్రమాదాల్లో మృతి చెందిన వారి సంఖ్య నాలుగుకు చేరింది.

**ప్రమాదాలకు కారణాలపై ఆందోళన:**

పరిశ్రమల్లో కాలం చెల్లిన పరికరాల వినియోగం, రియాక్టర్ల భద్రతా వ్యవస్థల నిర్వహణలో లోపాలు, ప్రమాదకర రసాయనాలపై సిబ్బందికి తగిన శిక్షణ లేకపోవడం వంటి అంశాలపై కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టరేట్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరిశ్రమల్లో క్రమం తప్పకుండా భద్రతా తనిఖీలు నిర్వహించాలని



వారు కోరుతున్నారు.

**పరిశ్రమల కాలుష్యంపై స్థానికుల ఆందోళన:**

పరిశ్రమల నుంచి వెలువడే వాయు, జల కాలుష్యంతో పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాగునీరు, గాలి కలుషితం కావడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు, పేలుళ్లతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

**రెడ్ కేటగిరీ పరిశ్రమలపై సమగ్ర తనిఖీలు చేయాలి:**

ప్రమాదాలు జరిగిన ప్రతిసారీ బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించడంతోనే సమస్య పరిష్కారం కాదని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం తక్షణమే రెడ్ కేటగిరీ పరిశ్రమలపై సమగ్ర భద్రతా తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయి. భద్రతా నిబంధనలను ఉల్లంఘించే పరిశ్రమల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుని, కార్మికులు మరియు పరిసర గ్రామాల ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాలని కోరుతున్నాయి.

# మళ్లీ తెర పైకి జమిలి!

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): భారత రాజకీయ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేసే కీలకమైన 'జమిలి ఎన్నికల' విధానంపై మరోమారు చర్చ మొదలైంది. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటే తమ సర్కారు అధికారంలో ఉన్న 22 రాష్ట్రాలు, యూటీల శాసన సభ ఎన్నికలను కలిపి నిర్వహించడానికి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్నది. ఈ మేరకు సాధ్యాసాధ్యాలపై అధికార కూటమి నేతలు విస్తృతంగా సమాలోచనలు చేస్తున్నట్టు జాతీయ వార్త పత్రిక 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ఓ కథనంలో వెల్లడించింది.

**కేంద్రం ఆలోచన ఇది..**

ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం ప్రకారం.. జమిలి ఎన్నికల నిర్వహణను విపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ క్రమంలో ఏక కాల ఎన్నికలను వీలైనంత త్వరగా నిర్వహించడానికి ఎన్డీయే ప్రభుత్వం కొత్త ఆలోచన చేసింది. దేశంలోని 17 రాష్ట్రాల్లో బీజేపీ సొంతంగా అధికారంలో ఉన్నది. మరో ఐదు రాష్ట్రాల్లో బీజేపీ మిత్ర పక్షాలు అధికారంలో ఉన్నాయి. అలా మొత్తంగా 22 రాష్ట్రాల్లో ఎన్డీయే ప్రభుత్వాలే ఉన్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలు జరుగడానికి ముందే ఎన్డీయే పాలిత 11 రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరుగనున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటే మరో నాలుగు ఎన్డీయే రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. మిగతా ఏడు ఎన్డీయేపాలిత రాష్ట్రాల ఎన్నికలు 2030–31 మధ్య జరుగనున్నాయి. దీంతో జమిలి ఎన్నికల కోసం తమ రాష్ట్రాల్లోని ప్రభుత్వాల పాలనను వెనక్కి కానీ ముందుకు కానీ జరుపుకునేందుకు పెద్దగా అభ్యంతరాలు ఉండకపోవచ్చని ఎన్డీయే సర్కారు భావిస్తున్నది.

**అందుకే తమ రాష్ట్రాల్లో ముందుగా..**

2029లో ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం, హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో 'జమిలి' ప్రక్రియకు పెద్దగా ఇబ్బందులు ఎదురు కావడం లేదు. అయితే 2028లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, త్రిపుర, తెలంగాణ, మేఘాలయ, నాగాలాండ్, మిజోరం అసెంబ్లీల గడువు ముగుస్తున్నది. జమిలి ఎన్నికల కోసం ఆయా అసెంబ్లీల కాలాన్ని 5 నెలల నుంచి ఏడాది వరకు పొడిగించాల్సి ఉంటుంది. ఇక బీహార్, ఢిల్లీ, తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీల గడువు 2030–31లో ముగియనున్నది. వాటి గడువును ఒకటి నుంచి రెండేండ్లు తగ్గించాల్సి వస్తుంది. అయితే, ఇంతటి భారీ సంస్కరణకు పార్లమెంట్ శాసనపరమైన మార్పులు చేయడంతో పాటు విస్తృత రాజకీయ ఏకాభిప్రాయం అవసరమవుతుంది. ఈ ప్రతిపాదనను జార్ఖండ్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న విపక్ష ప్రభుత్వాలు పెద్దయెత్తున వ్యతిరేకించే అవకాశం ఉన్నది. ఈ క్రమంలోనే తొలుత తాము అధికారంలో ఉన్న 22 రాష్ట్రాల్లో జమిలి ప్రక్రియను కొనసాగించడానికి ఎన్డీయే ప్రభుత్వం కార్యచరణ సిద్ధం చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి.

**సాధ్యమే అంటూ సంకేతాలు**

22 ఎన్డీయే పాలిత రాష్ట్రాల శాసనసభ ఎన్నికలను లోక్‌సభ ఎన్నికలతో నిర్వహించే విషయమై ఇండియన్ ఎక్స్‌ప్రెస్.. జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) చైర్మన్ పీపీ చౌదరిని సంప్రదించింది. దీనికి ఆయన స్పందిస్తూ.. 'దీనిపై ఎన్డీయే పాలిత ముఖ్యమంత్రులే నిర్ణయం తీసుకోవాలి. ఈ అంశం కమిటీ పరిధిలోకి రాదు' అని పేర్కొన్నారు. కాగా 2029 నాటికి జమిలి ఎన్నికలు సాధ్యమే అంటూ ఇటీవల సంకేతాలు ఇచ్చిన పీపీ చౌదరి.. రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి వన్ నేషన్ వన్ ఎలక్షన్ కసరత్తుని పూర్తి చేసేందుకు తమ కమిటీ కృషి చేస్తున్నదని పేర్కొన్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా జమిలి ఎన్నికల బిల్లుకు సంబంధించిన అంశంలో గత నెలలో పార్లమెంట్ కీలక నిర్ణయం తీసుకొన్నది. జమిలి ఎన్నికలకు సంబంధించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లులను పరిశీలిస్తున్న జేపీసీ కాల పరిమితిని వచ్చే శీతాకాల సమావేశాల చివరి వారం వరకూ పొడిగిస్తూ ఆమోదం తెలిపింది. దీంతో జమిలిపై వచ్చే శీతాకాల సమావేశాల్లో ఏదైనా ప్రకటన వెలువడవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటు 22 ఎన్డీయే రాష్ట్రాల శాసనసభ ఎన్నికల వార్తలను కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ ఊహాగానాలుగా కొట్టిపారేశారు.

**1967 తర్వాత దెబ్బతిన్న ఎన్నికల చక్రం**

దేశంలో 1952 నుంచి 1967 మధ్య మొదటి నాలుగు సాధారణ ఎన్నికల చక్రాలలో లోక్‌సభ, చాలా రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించారు. అయితే 1967 తర్వాత పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కూలిపోవడంతో ఈ ఉమ్మడి ఎన్నికల చక్రం దెబ్బతిన్నది. 1971లో జరిగిన ముందస్తు లోక్‌సభ ఎన్నికలు తదితర పరిణామాలు ఈ చక్రాన్ని మరింతగా దెబ్బతీశాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న జనాభా లెక్కల్లో కుల గణన చేయడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మోదీ ప్రభుత్వం భారతదేశ తదుపరి జనాభా లెక్కల్లో కులాన్ని పరిగణిస్తామని ఏప్రిల్ 2025లో ప్రకటించింది. ఆ సమయంలో 2011 నాటి జనాభా లెక్కల్లో కులాన్ని చేర్చకపోవడం నాటి మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ తప్పిదమంటూ విమర్శలు గుప్పించింది. ఆనాడే మెజారిటీ రాజకీయ పార్టీలు కులగణన నిర్వహించాలని సిఫార్సు చేశాయని క్యాబినెట్‌లో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే ఇది చెప్పిన ఏడాది తర్వాత మోదీ ప్రభుత్వం నాటి మన్మోహన్‌సింగ్ పరిపాలనా కాలంలో ఉపయోగించిన పద్ధతినే కుల గణనకు అనుసరిస్తామని తెలిపింది.

# కొడుకుతో అక్రమ సంబంధం పెట్టుకున్న పిన్ని..

- ఏకాంతంగా ఉండగా చూశాడని కక్ష.. కర్ర, బండరాయితో దాడి
- భర్త కాళ్లు పట్టుకున్న భార్య.. తలపై రాయితో మోది హత్య

**తొలివెలుగు, చౌటుప్పల్:** అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే నెపంతో భార్య తన ప్రియుడితో కలిసి భర్తను దారుణంగా హత్య చేసిన ఘటన చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పంతంగి శనగలగుట్ట వద్ద చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి నిందితులైన భార్యతో పాటు ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను చౌటుప్పల్ డీఎస్పీ పి. మధుసూదన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ జి. మన్మథకుమార్ వెల్లడించారు. అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన రాపోలు దానయ్య (36) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడి భార్య రాపోలు శారద (34)కు వరుసకు బావ కుమారుడైన రాపోలు శివ అలియాస్ చింటూ (19)తో వివాహేతర సంబంధం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 23న శారద, శివ ఏకాంతంగా ఉన్న సమయంలో దానయ్య వారిని చూడటంతో ఆగ్రహానికి గురయ్యాడు. శివపై దాడికి ప్రయత్నించిన క్రమంలో శివ కర్రతో దానయ్యపై దాడి చేయడంతో అతడు కిందపడిపోయినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం




శారద తన భర్త రెండు కాళ్లను పట్టుకోగా.. శివ సమీపంలో ఉన్న బండరాయితో దానయ్య తలపై మోది హత్య చేసినట్లు వెల్లడించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్‌తో సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలను సేకరించారు. దర్యాప్తులో శారద, శివలను నిందితులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. చౌటుప్పల్ డీఎస్పీ పి. మధుసూదన్‌రెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మథకుమార్, ఎస్సైలు కె. యాదగిరి, పి. రవీందర్, బి. అజయ్‌భార్గవ్, కానిస్టేబుళ్లు అశోక్, ఉదయ్, జంగయ్యతో పాటు పోలీసు సిబ్బంది సమన్వయంతో కేసును ఛేదించారు. నిందితులను అరెస్ట్ చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



## ఆత్మగౌరవం కోసమే పోరాటం

**ఐక్య పోరాటాలకు ఏపీ ఎన్జీవో, ఇతర సంఘాలు కలిసి రావాలి**
**28న జరిగే రాష్ట్ర సదస్సు పోస్టర్, కరపత్రం విడుదల**
**పీఆర్సీ, 30 శాతం ఐఆర్, పెండింగ్‌లో ఉన్న 5 డీఏలు ఇవ్వాలి**
**రూ.40 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని ఉద్యోగుల డిమాండ్**

అమరావతి: న్యాయమైన హక్కుల సాధనకు, ఆత్మగౌరువాన్ని కాపాడుకునేందుకు, రూ.40 వేల కోట్ల బకాయిలను సాధించుకునేందుకు రాష్ట్రంలోని ఉద్యోగులంతా ఏకతాటిపైకి వచ్చి ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఉద్యోగుల సమస్యులను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదున్నారు. ఈ నెల 28న విజయవాడలో నిర్వహించనున్న ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర స్థాయి సదస్సు పోస్టర్, కరపత్రాలను ఇతర నాయుకులతో కలిసి సోమవారం ఆయన విజయువాడులో విడుదల చేశారు. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ ఏపీ ఎన్జీవో నాయకత్వం కూడా ఉద్యమానికి కలిసి రావాలని కోరారు. గతంలో మాదిరిగా ఏపీ జేఏసీ, ఏపీ జేఏసీ అమరావతి ఐక్య ఉద్యమ కార్యాచరణ రూపొందిద్దామని తెలిపారు. రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘంతోపాటు ఇప్పటికే ఉద్యుమాలు చేస్తున్న ఉపాధ్యాయ జేఏసీ కూడా ఐక్య ఉద్యమానికి కలిసి రావాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఎన్నిుసార్లు ప్రభుత్వాన్ని కోరినా, వినతిపత్రాలు ఇచ్చినా, చర్చలకు హాజరైనా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కూటమి నాయకులు ఎన్నికల ముందు ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ, చర్చల పేరుతో కాలయాపన చేస్తూ తమ ఆత్మగౌరవం దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. తమ సమస్యలపై కనీసం సమాధానం చెప్పే పరిస్థితి కూడా లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ జేఏసీ అమరావతి సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలవుతాయని ఇంతకాలం ఓపికతో ఎదురు చూశామని, అయితే దీన్ని ఉద్యోగుల బలహీనతగా చూడకూడదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం, కాలయాపన చేయడం ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తున్నాయని తెలిపారు. తాము చేసే ఉద్యమం కేవలం బకాయిల కోసం చేసే పోరాటం కాదని, ఉద్యోగుల హక్కులు, ఆత్మగౌరవం, భద్రత, భవిష్యత్తు కోసం చేసే పోరాటమని ఏపీ జేఏసీ అమరావతి నేత ఫణి పేర్రాజు చెప్పారు. సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ఉద్యోగుల ప్రజాస్వామ్య హక్కు అని స్పష్టం చేశారు. ఈ నెల 28న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఏపీ జేఏసీ అమరావతి మహిళా నేతలు పి.లక్ష్మి, పి విజయలక్ష్మి కోరారు.

## రాజకీయ సన్యాసం ప్రసక్తే లేదు: మమతా బెనర్జీ

**బీజేపీని కనుమరుగు చేసే వరకు విశ్రమించనని శపథం**
**జనగణన పేరుతో ఎన్ఆర్సీ అమలుకు కుట్ర అని ఆరోపణ**
**అన్నపూర్ణ భండార్ పథకంపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్**
**ఓటర్ల తొలగింపుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని వెల్లడి**

తాను రాజకీయాల నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. బీజేపీని అధికార పీఠం నుంచి దించే వరకు తన పోరాటం ఆగదని ఆమె తేల్చిచెప్పారు. సోమవారం ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన నాలుగు నెలల్లోనే బీజేపీ అసలు స్వరూపం ప్రజలకు అర్థమైందని ఆమె పేర్కొన్నారు. ఎన్ఆర్సీ అమలు చేసేందుకే కేంద్ర ప్రభుత్వం జనగణనను ఒక సాకుగా వాడుకుంటోందని ఆరోపించారు. జనగణన దరఖాస్తులపై సంతకాలు చేసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 'అన్నపూర్ణ భండార్' పథకం కింద ఆర్థిక సాయం అందడంలో జాప్యం జరుగుతోందని, అనర్హత సాకుతో లబ్ధిదారుల సంఖ్యను కుదించడం ఎన్నికల వాగ్దానాలను ఉల్లంఘించడమేనని ఆమె విమర్శించారు. ఇటీవల జాదవ్‌పుర్ విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ, వామపక్ష విద్యార్థి సంఘాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణల వెనుక బీజేపీ హస్తం ఉందని ఆమె ఆరోపించారు. క్యాంపస్‌లలో హింసను ప్రేరేపిస్తూ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారని, వారి పేర్లను తిరిగి చేర్చేందుకు అవసరమైతే మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మమతా బెనర్జీ స్పష్టం చేశారు.



# ఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసు.. సాదిక్ ఖాన్‌కు రిమాండ్

- బాధితుల కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి
- సాదిక్ ఖాన్ వేధింపులే ఆత్మహత్యలకు కారణమని తీవ్ర ఆరోపణ
- 10 మందితో టెర్రరిస్ట్ గ్యాంగ్ ఏర్పాటు చేసి వేధిస్తున్నాడన్న విజయసాయి
- ఇది లవ్ జిహాద్ అని, గత ప్రభుత్వ హయాంలోనే మొదలైందని వ్యాఖ్య
- ఈ కేసులో ఇప్పటికే అరెస్టయి విచారణలో ఉన్న నిందితుడు సాదిక్

రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన కాకినాడ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుడు సాదిక్ ఖాన్‌కు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఘటన జరిగిన నాటి నుంచి తప్పించుకు తిరుగుతున్న అతడిని ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో అరెస్ట్ చేసిన పోలీసులు, సోమవారం కాకినాడకు తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచారు. సాదిక్ ఖాన్ వేధింపుల కారణంగానే నూకరాజు కుటుంబం బలవన్మరణానికి పాల్పడిందని కాకినాడ ఎస్పీ బిందుమాధవ్ మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. కేసు దర్యాప్తు వివరాలను ఎస్పీ వెల్లడిస్తూ.. రెండు ఆత్మహత్య లేఖలు ఈ కేసులో కీలక ఆధారాలుగా నిలిచాయని తెలిపారు. నూకరాజు రాసిన లేఖతో పాటు, ఆయన కుమార్తె సౌజన్య స్కూటీలో లభించిన మరో లేఖలోనూ సాదిక్ ఖాన్ పేరు స్పష్టంగా ఉందని చెప్పారు. అతని వేధింపులు భరించలేకే ఈ తీవ్ర నిర్ణయం తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారని, ఈ ఆధారాలతోనే దర్యాప్తును ముమ్మరం చేశామని వివరించారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఇతర లేఖల గురించి తాము ఇప్పుడేమీ చెప్పలేమని, పక్కా ఆధారాలతోనే ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని స్పష్టం చేశారు. ఘటన అనంతరం సాదిక్ తన ఫోన్లను స్విచాఫ్ చేసి పోలీసులకు చిక్కకుండా తప్పించుకునే ప్రయత్నం చేశాడు. అతడిని పట్టుకునేందుకు 10 ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి, ఐదు రాష్ట్రాల్లో ముమ్మరంగా గాలించారు. చివరకు మీరట్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అనంతరం సర్పవరం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్పీ, ఐదుగురు సీఐలతో కూడిన బృందం సాదిక్‌ను విచారించింది. వైద్య పరీక్షల అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో అతడిని కాకినాడ సబ్ జైలుకు తరలించారు. మరిన్ని వివరాలు రాబట్టేందుకు మంగళవారం కస్టడీ పిటిషన్ దాఖలు చేస్తామని, కస్టడీ విచారణలో మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఎస్పీ తెలిపారు. సాదిక్ నిర్వహిస్తున్న షూటింగ్ అకాడమీపైనా పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు కీలక సూచన చేసిన ఎస్పీ.. వేధింపులు ఎదురైనప్పుడు



ప్రాణాలు తీసుకునే బదులు ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలని కోరారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచి, వారికి పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కేసులో నూకరాజు కుటుంబం ముందుగా ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఆయన పేర్కొనడం గమనార్హం.

**కాకినాడ ఫ్యామిలీ సూసైడ్.. ఇది లవ్ జిహాదే: విజయసాయి సంచలన ఆరోపణలు**

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కాకినాడ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య ఘటనలో రాజకీయ వేడి రాజుకుంది. నిందితుడు సాదిక్ ఖాన్ వేధింపుల వల్లే ఈ ఘోరం జరిగిందని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఇది సాధారణ వేధింపుల కేసు కాదని, దీని వెనుక పక్కా ప్రణాళికతో కూడిన "లవ్ జిహాద్" ఉందని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కోనసీమ జిల్లా రావులపాలెంలో నూకరాజు అల్లుడు జగదీశ్వర్ రెడ్డి కుటుంబాన్ని, ప్రాణాలతో బయటపడిన చిన్నారి రియాన్ష్ కార్తికేయ రెడ్డిని విజయసాయిరెడ్డి పరామర్శించారు. ఆత్మహత్యలకు దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, సాదిక్ ఖాన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సాదిక్‌ను కరడుగట్టిన నేరస్థుడిగా అభివర్ణించిన ఆయన, కాకినాడ, రాజమండ్రి ప్రాంతాల్లో సుమారు 15 హిందూ కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నాడని ఆరోపించారు. సాదిక్, మరో తొమ్మిది మంది కలిసి ఒక 'టెర్రరిస్ట్ గ్యాంగ్'గా ఏర్పడ్డారని విజయసాయి ఆరోపించారు. మహిళలను లక్ష్యంగా చేసుకుని, బలవంతంగా ఇస్లాంలోకి మార్చడం, వారి ఆస్తులను కాజేయడమే ఈ ముఠా లక్ష్యమని అన్నారు. నూకరాజు కుటుంబానికి చెందిన రూ. 40 కోట్ల విలువైన ఆస్తులు, రావులపాలెంలోని 40 సెంట్ల భూమిని సాదిక్ బలవంతంగా రాయించుకున్నాడని తెలిపారు. వీటితో పాటు రూ. 2 కోట్ల బంగారం, రూ. 2 కోట్ల నగదు కూడా తీసుకున్నాడని ఆరోపించారు. గతంలో సౌజన్య భర్త జగదీశ్వర్ రెడ్డికి విషం పెట్టి చంపి, ఆ ఇన్సూరెన్స్ డబ్బును కూడా సాదిక్ కాజేశాడని ఆయన చేసిన ఆరోపణలు తీవ్ర కలకలం రేపాయి. ఆత్మహత్యకు ముందు సౌజన్య రాసిన లేఖలో అనేక కీలక విషయాలు వెల్లడయ్యాయని అన్నారు. విచారణలో తనకు ఇద్దరు వ్యక్తులు సహకరించారని సాదిక్ చెప్పినట్టు తనకు తెలిసిందని విజయసాయి పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఏపీలో లవ్ జిహాద్ మొదలైందని వ్యాఖ్యానించారు. త్వరలోనే విజయవాడలో కొత్త పార్టీ గురించి మాట్లాడతానని చెప్పారు.

**ఘటన నేపథ్యం:**


కాకినాడ అశోక్ నగర్‌లో నివాసముంటున్న పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు (61), తన భార్య మీనా (58), కుమార్తె సౌజన్య (38), మనవడు రియాన్ష్‌తో కలిసి ఆగస్టు 16న రాత్రి రాజమండ్రి రోడ్-కమ్-రైల్వే బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికుల సమాచారంతో పోలీసులు, మత్స్యకారులు రంగంలోకి దిగారు. సుమారు 20 నిమిషాల పాటు ఈదుతూ సహాయం కోసం కేకలు వేసిన బాలుడు రియాన్ష్‌ను మత్స్యకారులు కాపాడారు. మిగిలిన ముగ్గురూ మృతి చెందారు. సాదిక్ ఖాన్ వేధింపులు భరించలేకే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు నూకరాజు, సౌజన్య రాసిన లేఖలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ లేఖల ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడు సాదిక్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

## కుటుంబ విభేదాలను రాజకీయంగా ఉపయోగించుకుంటున్నారు: కుమారుడి వివాదంపై జోగి రమేశ్

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ తన కుటుంబంలో తలెత్తిన వివాదంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడు రాజీవ్, కోడలు మేఘన మధ్య ఉన్న విభేదాలను కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఒక టీడీపీ ఎమ్మెల్యే ప్రమేయం ఉందంటూ ఆయన విడుదల చేసిన వీడియో ప్రకటన ఇప్పుడు రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. ఈ సందర్భంగా జోగి రమేశ్ మాట్లాడుతూ, "నా కోడలు మేఘన కుటుంబ సభ్యులు మైలవరం టీడీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కార్యాలయానికి వెళ్లారు. కేవలం నా కుటుంబాన్ని రాజకీయంగా లక్ష్యంగా చేసుకోవాలనే దురుద్దేశంతోనే ఈ వివాదంలోకి రాజకీయాలను లాగుతున్నారు" అని ఆరోపించారు. ఇది తనను, తన కుటుంబ సభ్యులను మానసిక ఇబ్బందులకు గురిచేసేందుకు జరుగుతున్న కుట్ర అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జోగి రమేశ్ చేసిన ఆరోపణలపై మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ స్పందించారు. ప్రజాప్రతినిధిగా తన కార్యాలయానికి ఎవరైనా రావొచ్చని, ఆ క్రమంలోనే మేఘన కుటుంబ సభ్యులు కూడా తనను కలిశారని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి పూర్తి వివరాలతో మరుసటి రోజు స్పష్టత ఇస్తానని ఆయన వెల్లడించారు. ఈ పరిణామాలతో జోగి రమేశ్ వ్యక్తిగత కుటుంబ వివాదం కాస్తా వైసీపీ, టీడీపీ నేతల మధ్య పరస్పర రాజకీయ ఆరోపణలకు దారితీసింది.



## శ్రావణమాసం మూడో శుక్రవారం కొత్త పార్టీని ప్రకటిస్తా: విజయసాయిరెడ్డి



తాను కొత్త పార్టీని ప్రారంభించపోతున్నట్టు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ విషయానికి సంబంధించి ఆయన ఈరోజు మరింత క్లారిటీ ఇచ్చారు. శ్రావణమాసం మూడో శుక్రవారం నాడు తన నూతన రాజకీయ పార్టీకి సంబంధించిన పేరు, జెండా, విధివిధానాలు మరియు పూర్తి ప్రణాళికను విజయవాడ వేదికగా అధికారికంగా వెల్లడిస్తానని ఆయన స్పష్టం చేశారు. ప్రజాసమస్యలపై పోరాడేందుకు, ప్రజల తరఫున గొంతుక వినిపించేందుకు చట్టసభల్లో ప్రత్యేకంగా ప్రతిపక్ష హోదా ఏమీ అవసరం లేదని విజయసాయి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ మాత్రమే ఏకైక ప్రతిపక్షంగా ఉందని పేర్కొన్నారు. సాధారణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, వారి సమస్యలను నేరుగా సభల వరకు తీసుకెళ్లేందుకు ఒక బలమైన స్వతంత్ర రాజకీయ వేదికను ఏర్పాటు చేయడమే తన లక్ష్యమని తెలిపారు.

## 20 వేల మంది జెన్‌జీ యువతతో మాటామంతి..



స్వామి వివేకానంద, శ్రీశ్రీ చెప్పినట్లుగా దేశ భవిష్యత్తును నిర్మించడంలో యువత పాత్ర అత్యంత కీలకమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. నేటి యువత దేశ అభివృద్ధి కోసం ఆలోచిస్తూ, హోదాలతో సంబంధం లేకుండా నాయకులను ప్రశ్నిస్తోందని, ఇది మంచి పరిణామమని ఆయన స్వాగతించారు. 20 వేల మంది జెన్‌జీ యువత భాగస్వామ్యంతో 55 రోజుల పాటు 51 ప్రాంతాల్లో ప్రత్యేకంగా 'మాటామంతి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు దేశ, రాష్ట్ర పురోగతికి తీసుకుంటున్న చర్యలపై ఈ వేదికగా చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి మంత్రి నారా లోకేశ్ పడుతున్న శ్రమను, కూటమి ప్రభుత్వం నెరవేర్చిన ఉద్యోగాల హామీని ఈ సందర్భంగా ప్రస్తావించారు.సీఎం చంద్రబాబు ముందస్తు ఆలోచనతో తీసుకొచ్చిన ఐటీ సంస్కరణల వల్లే నేడు యువతకు ఉద్యోగావకాశాలు విస్తృతంగా లభిస్తున్నాయని చెప్పారు. బహిరంగంగా మాట్లాడలేని యువత కోసం ప్రత్యేక ఫోన్ నంబర్, ఈమెయిల్ ఐడీని అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు.



# ట్రంప్ మ్యాప్‌ల సంబరం!

హోర్ముజ్ జలసంధిని 'చాలా త్వరలోనే' అమెరికా భూభాగంగా మారుస్తానని గతవారం ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించినప్పుడు ఇరాన్‌పై మళ్లీ భీకర దాడులకు తెగబడొచ్చని కొందరు అనుమానించారు. తీరా మంగళవారం ఆయన చేసిందల్లా 'అమెరికా కొత్త భూభాగం' అని రాసివున్న హోర్ముజ్ జలసంధి మ్యాప్‌ను విడుదల చేయటమే. దీంతో ఇరాన్ దౌత్యవేత్తలు ప్రతిదాడికి దిగారు. కాలిఫోర్నియాను ఇరాన్ భూభాగంగా చూపుతూ ఇరాన్ కాన్సులేట్ ఒక చిత్రపటాన్ని విడుదల చేసింది. వేరే దేశాల భూభాగాలు డిమాండ్ చేయటం, వాటిని అమెరికా భౌగోళిక చిత్రపటాల్లో భాగంగా చూపటం ట్రంప్‌కు కొత్తేం కాదు. రెండోసారి అధికారంలోకొచ్చిన వెంటనే గ్రీన్‌లాండ్‌పై ఆయన కన్నుపడింది. అలాగే కెనడాను అమెరికాలో విలీనం చేసుకుని 51వ రాష్ట్రంగా మారుస్తామనీ, పనామా కాల్వ ఇకపై తమదేననీ, గాజాను 'సొంతం' చేసుకుంటామనీ కూడా పలుమార్లు చెప్పారు. అందుకు సంబంధించి ఒక వీడియో రూపొందించి విడుదల చేశారు. వెనిజులా మ్యాప్‌లో అమెరికా జెండాను సూచించే రంగులు నింపారు. అలాగే ఇకపై గల్ఫ్ ఆఫ్ మెక్సికోను గల్ఫ్ ఆఫ్ అమెరికాగా వ్యవహరించాలంటూ ఉత్తర్వులు జారీచేశారు. అట్లాంటిక్ మహాసముద్రంలోని ఈ ప్రాంతం మెక్సికోకు పశ్చిమ, దక్షిణ దిశల్లో, అమెరికాకు ఉత్తరంవైపు, క్యూబాకు ఆగ్నేయంవైపు ఉంది. పేరు మార్చినా ప్రాదేశిక జల పరిధులేమీ మారడంలేదు గనుక మెక్సికో, క్యూబాలు ఈ విషయంలో మౌనంగా ఉండిపోయాయి. ఇక పర్షియన్ గల్ఫ్ పేరును గల్ఫ్ ఆఫ్ అరేబియాగా మారుస్తామని తొలి ఏలుబడిలో 2017లో ప్రకటించారు. దాంతో అప్పటి ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ జాగ్రఫీ చదువుకోమని ట్రంప్‌కు సలహా ఇచ్చారు. నిరుడు మే నెలలో సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ పర్యటనకెళ్లే ముందు పేరు మార్పు ఉంటుందని ప్రకటించారు. అటు తర్వాత ఎందుకో దాని జోలికి పోలేదు. ఈ 'భౌగోళిక చిత్రపట దురాక్రమణల్ని' చూసి జనం కాలక్షేపానికి నవ్వుకోవచ్చు. ట్రంప్ ప్రదర్శిస్తున్న అమాయకత్వమో, అజ్ఞానమో చూసి జాలిపడే వారూ ఉండొచ్చు. కానీ అగ్ర రాజ్యాల చరిత్ర తెలిసినవారు దాన్నంత తేలిగ్గా వదిలేయరు. ఒక విశాల పాలస్తీనా భూభాగంలోకి కొన్ని దశాబ్దాల్లో భారీయెత్తున యూదుల్ని తరలించి, అక్కడ నరమేధాలకు పాల్పడి ఇజ్రాయెల్‌ను సృష్టించి, అందుకు ఐక్యరాజ్యసమితి ఆమోదాన్ని 'రాబట్టిన' చరిత్ర ఆ దేశాలది. కనుక ఇప్పుడు ఉబుసుపోక మాట్లాడే మాటల్లో వేరే అర్థాలు ఉండొచ్చన్న అనుమానాలు రావటం సహజం. రాజకీయావతారం ఎత్తి దాదాపు పదిహేనేళ్లవుతున్నా పూర్వాశ్రమంలో నిర్వహించిన రియలెస్టేట్ వ్యాపార ప్రభావంనుంచి ట్రంప్ బయటపడలేకపోతున్నారన్నది వాస్తవం. రియలెస్టేట్ యజమాని మాదిరే ఆయన భూదాహంతో అల్లాడిపోతున్నారు.

# సోషల్ మీడియాపై రణభేరి!


సామాజిక మాధ్యమాలు వచ్చాక ప్రపంచ పరిణామాలన్నీ వెంటవెంటనే అందరికీ చేరుతున్నాయి. అవి భావవ్యక్తీకరణ విస్తృతిని పెంచి కోట్లాదిమందికి గొంతునిస్తు న్నాయి. ఇన్నాళ్లూ మౌనంగా, నిస్సహాయంగా వీక్షించినవారంతా నిక్కచ్చిగా, నిర్మొహ మాటంగా తమ అభిప్రాయాలు వినిపిస్తున్నారు. కానీ మంచితోపాటే చెడు కూడా ఇందులో కలగలిసివుంది. వాటి కారణంగా అనవసర వదంతులు వ్యాపించి ఎందరో అమాయకులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మన దేశం వరకే తీసుకుంటే దొంగ లుగా ముద్రపడి కొన్నిచోట్ల, గోవుల్ని తరలిస్తున్నారని ఆరోపణలొచ్చి మరికొన్నిచోట్ల ఉన్మాద గుంపులు దాడులు చేసి హతమార్చిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. టీనేజర్లు, పిల్లల మనసుల్లో ఈ వేదికల దుష్ప్రభావం కూడా నానాటికీ పెరుగుతోంది. మానసిక ఒత్తిళ్లకూ, రుగ్మతలకూ అవి కారణమవుతున్నాయి. అమెరికా అప్పీళ్ల కోర్టులో మెటా, ఆల్ఫాబెట్, స్నాప్‌చాట్, టిక్‌టాక్ తదితర సంస్థలపై సోమవారం 3,000కు పైగా పిటిషన్లు దాఖలు కావటాన్ని ఈ నేపథ్యంలో చూడాలి. 'పబ్లిక్ న్యూసెన్స్' కింద దాదాపు 40 రాష్ట్రాలతోపాటు మున్సిపాలిటీలు, పాఠశాలలు, వ్యక్తులు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. వాస్తవానికి మొన్న మార్చిలోనే లాస్ ఏంజెలెస్‌కి చెందిన న్యాయస్థానం సామాజిక మాధ్యమ వేదికల్ని యువతకు హానికరమైన రీతిలో రూపొందించటాన్ని తప్పుబట్టింది. చిన్న వయసులో ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లు తనను బానిసగా మార్చాయనీ, ఇందువల్ల తీవ్రంగా నష్టపోయాననీ ఆరోపిస్తూ కోర్టుకెక్కిన 20 యేళ్ల యువతికి 60 లక్షల డాలర్ల పరిహారం చెల్లించాలని ఆ న్యాయస్థానం తీర్పునిచ్చింది. న్యూమెక్సికోలో సైతం మెటాపై ఈ తరహా తీర్పే వెలువడింది. వేదికకు సంబంధించిన భద్రత విషయంలో వినియోగదారుల్ని అది తప్పుదోవ పట్టించిందని న్యాయస్థానం నిర్ధారించింది. 37.5 కోట్ల డాలర్ల పరిహారం చెల్లించాలని సంస్థను ఆదేశించింది. చాన్నాళ్లక్రితమే టీనేజర్లపైనా, పిల్లలపైనా సామాజిక మాధ్యమాల దుష్ప్రభావం ఎలా ఉన్నదో ప్రభుత్వాలు గుర్తించాయి. ఆస్ట్రేలియా పదహారేళ్లలోపు పిల్లలకు సామాజిక మాధ్యమాల ప్రవేశాన్ని నిషేధించింది. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకునే బాధ్యతను టెక్ సంస్థలపైనే పెట్టింది. దీన్ని పాటించనట్టయితే దాదాపు 5 కోట్ల ఆస్ట్రేలియా డాలర్లు జరిమానా చెల్లించాలని చట్టం నిర్దేశించింది. బ్రిటన్, ఫ్రాన్స్ సైతం ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నాయి. యూరోపియన్ యూనియన్(ఈయూ) హానికర మైన పోస్టుల్ని తొలగించటంలో జాప్యం జరిగితే గ్లోబల్ టర్నోవర్‌లో 6 శాతం మొత్తాన్ని జరిమానా విధించే చట్టం తీసుకొచ్చింది. తెలిసో తెలియకో ఏదైనా వీడియో చూస్తే ఆ వెనువెంటనే అటువంటివే కుప్పలు తెప్పలుగా వచ్చిపడేలా ఆ మాధ్యమాలు అల్గారిథమ్‌లు రూపొందిస్తున్నాయి. తెలిసీ తెలియని వయసులో ఉన్న పిల్లల్ని వ్యామోహాల బారిన పడేస్తున్నాయి. ఇలాంటి ఆరోపణలొచ్చినప్పుడల్లా ఈ మాధ్యమాలు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. తాము కేవలం ఒక వేదిక మాత్రమే కల్పిస్తున్నామనీ, అందులో వేరెవరో ఉంచే కంటెంట్‌కు తామెలా బాధ్యులమనీ ప్రశ్నిస్తున్నాయి. ఏటా వేలాదికోట్ల డాలర్ల లాభాలు ఆర్జించే ఉద్దేశంతోనే ఈ సంస్థలు జుగుప్సాకర, హింసాత్మక అంశాలున్న వీడియోల్ని చూసీ చూడనట్టు వదిలేస్తున్నాయి. సామాజిక మాధ్యమాలు భావప్రకటనా స్వేచ్ఛకు అనువైనవి. కానీ అవి దుర్వినియోగమైన పక్షంలో కఠినచర్యలుండాలి.

# అనిశ్చితిలో వెలుగురేఖ



'బలవంతుడ నాకేమని...' అనుకుంటే దశాబ్దాల తరబడి అమెరికా నిర్మించుకుంటూ వస్తున్న పునాదులు కదిలిపోతాయని ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఇంకా జ్ఞానో దయం కాలేదు. నాటో శిఖరాగ్ర సదస్సుకు పోయి ఈసారి కాస్తంత స్నేహపూర్వకంగా మాట్లాడినా అటువైపునుంచి మునుపటి సాన్నిహిత్యం లేదని తుర్కియేలో ముగిసిన ఆ సదస్సు తీరుతెన్నులు చెబుతున్నాయి. అమెరికాతో ఇప్పటికీ సన్నిహిత సంబంధాలే ఉన్న మన దేశం సైతం ఆయన తరచు చేసే ప్రకటనల కారణంగా ఇబ్బంది పడుతోంది. హఠాత్తుగా 'ఇండో--పసిఫిక్' పేరు మారాక లోలోన అసంతృప్తి సరేసరి. ఈ నేపథ్యంలో ఇండో--పసిఫిక్ విషయంలో మన వైఖరిని తేటతెల్లం చేసేలా, మన చొరవను మరింత పెంచేలా ప్రధాని నరేంద్ర మోదీ ఇండొనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ఆరు రోజుల పర్యటన ఈ నెల 6న మొదలైంది. ఇప్పటికే ఇండొనేసియా, ఆస్ట్రేలియా పర్యటనలు పూర్తి చేసుకున్న మోదీ శుక్రవారం న్యూజిలాండ్ చేరుకున్నారు. అమెరికా, చైనాలతో... వాటి వైఖరులతో సంబంధం లేకుండా భద్రత, వాణిజ్యం తదితర రంగాల్లో భిన్న దేశాల సహకారం అవసరమని మన దేశం భావించబట్టే ఈ పర్యటన ఖరారైంది. ఈ మూడూ సాగరప్రాంత దేశాలు. ఎప్పుడో 1992లోనే రూపుదిద్దుకున్న 'లుక్ ఈస్ట్' విధానానికి కొనసాగింపుగా మన దేశం 'మహాసాగర్' దార్శనికతను ప్రతిపాదించింది. పరస్పర సంపూర్ణ అభివృద్ధికి ప్రాంతాలవారీ భద్రత, సమగ్రవృద్ధి అవసరమన్నదిదాని సారాంశం. సాధారణ ఆర్థిక సంబంధాలు మొదలుకొని భారీ రక్షణ, ఇంధన భాగస్వామ్యం వరకూ అనేకం దీని పరిధిలోకొస్తాయి. ఆస్ట్రేలియాతో గురువారం కుదిరిన పౌర అణుశక్తి ఒప్పందం చరిత్రాత్మకమైనది. ఇదిగాక ఆధునిక సాంకేతికతలూ, రక్షణ, భద్రత సహకారం, సరఫరా గొలుసు మెరుగు పరచటం తదితరాలకు సంబంధించి మరో 18 ఒప్పందాలు కుదిరాయి. పారిస్‌ఒప్పందం కింద స్వచ్ఛ ఇంధన లక్ష్యం సాధనకు మన అణు రియాక్టర్లకు నిరంతరాయంగా యురేనియం అవసరమవుతుంది. ప్రస్తుతం ఉన్న 7.7 గిగావాట్ల అణు విద్యుత్‌ను 2047కల్లా 100 గిగావాట్లకు పెంచాలని భారత్ నిర్దేశించుకుంది. ఇందుకోసం ప్రపంచ యురేనియం నిక్షేపాల్లో 28 శాతంగల ఆస్ట్రేలియాతో ఒప్పందం కుదరటం కీలక పరిణామం. ప్రపంచ పరిణామాల కారణంగా హఠాత్తుగా నిలిచిపోతున్న ఇంధన సరఫరా తీరును సరిదిద్దటానికి ఎల్‌ఎన్‌జీ, బొగ్గు, డీజిల్‌వంటి సంప్రదాయ ఇంధన వనరుల విషయంలో పరస్పరం సహకరించుకుంటూ ఇంధన భద్రతను బలోపేతం చేసుకోవాలని రెండు దేశాలూ నిర్ణయించుకున్నాయి. ఏనాటి నుంచో సాన్నిహిత్యంగల ఇండొనేసియాతో మరిన్ని రంగాల్లో సహకారానికి ఈ నెల 6నుంచి 8వరకూ వరసగా మూడురోజులపాటు కొనసాగిన పర్యటనలో ఒప్పందాలు కుదిరాయి. మన బ్రహ్మోస్, అస్త్ర క్షిపణుల్ని కొనుగోలు చేయటానికి ఇండొనేసియా ఒప్పందం కుదుర్చుకుంది. ఇరు దేశాలూ కలిసి ఇండొనేసియాలోని ఆచే, అండమాన్, నికోబార్ దీవుల్లో నౌకాశ్రయాలను నిర్మించటానికి కూడా అధినేతలిద్దరూ అంగీకరించారు. అలాగే హిందూసముద్రం మొదలుకొని పసిఫిక్ మహాసముద్రంవరకూ పరస్పర సహకారంతో సముద్రజలాల్లో భద్రతను పెంచటానికి ఒప్పందం కుదిరింది. ఇప్పటికే జపాన్, దక్షిణ కొరియాలతో ఉన్న సహకారానికి ఇండొనేసియా కూడా తోడుకావటం వల్ల ఇండో--పసిఫిక్‌లో పటిష్టమైన సమన్వయం ఏర్పడుతుంది. చైనాతో అంటకాగటానికిట్రంప్ ప్రయత్నిస్తున్న దశలో ఇది కీలక పరిణామం. నిరుడు మన దేశంలో న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ పర్యటించినప్పుడు ద్వైపాక్షిక రక్షణ సహకార ఒప్పందం కుదిరింది. దాంతోపాటు మొన్న ఏప్రిల్‌లో రెండు దేశాలూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) కుదుర్చుకున్నాయి. దీన్ని ముున్ముందు మరింత విస్తృతపర్చుకోవటానికి ఇప్పటికే ఇరు దేశాలూ నిర్ణయించుకున్నాయి. కూటముల్లో చేరే విషయంలో న్యూజిలాండ్‌కు పెద్దగా ఆసక్తి లేదు. అయితే ప్రాంతీయ భద్రతను పెంపొందించుకోవటానికి భారత్, ఆస్ట్రేలియాలతో కలిసి పనిచేయాలని ఇప్పటికే నిర్ణయించుకుంది.

# అట్లాంటి నేతలతో ఇట్లాంటి పార్టీయే



చేనులో మంచి దోస విత్తనాలు వేస్తాము. తీగలు బాగా వచ్చి కొంతకాలం మంచి కాయలు వస్తాయి. తర్వాత సీజన్ అయిపోయి కుక్కమూతి పిందెలు రావటం మొదలవుతుంది. అది ప్రకృతి సహజమైన క్షీణత గనుక అంతటితో వదలి పెడుతాము. కాంగ్రెస్ పరిస్థితి అదే విధంగా ఉన్నది. అనేక దశాబ్దాలపాటు దేశానికి మంచి నాయకులను ఇచ్చింది. కొంతకాలంగా కుక్కమూతి పిందెలను కాయటం మొదలుపెట్టింది. వారు నడిపే ప్రభుత్వాలు కూడా అందుకు తగినట్టుగా ఉండటం సహజం. కనుక వారినిక వదిలివేయటం తప్ప ప్రత్యామ్నాయంలేదు. తెలంగాణలో ప్రస్తుత పరిస్థితిని చూద్దాము. స్వయంగా తమ ప్రతిభ ఏమీ లేకున్నా కొన్ని కారణాల వల్ల అధికారానికి వచ్చారు. వివేకం, సమర్థత ఉన్నవారైతే బాగా పరిపాలిస్తారు. పార్టీని బలోపేతం చేసుకుంటారు. తమ అధికారం దీర్ఘకాలికం అయ్యే విధంగా ప్రజాదరణ సంపాదిస్తారు. కానీ, పరిపాలన సగకాలం గడిచేసరికే పరిస్థితులు ఏ విధంగా మారుతున్నాయో ప్రతిరోజూ చూస్తున్నాము. ఒకవైపు ప్రభుత్వ పాలన, మరొకవైపు పార్టీ నిర్వహణ కూడా. అగ్ర నాయకుల నుంచి కింది వరకు. అందువల్లనే పార్టీ ఇట్లా తయారవుతున్నది. సాక్షాత్తు ముఖ్యమంత్రి నుంచి పీసీసీ అధ్యక్షుడి నుంచి, ఇతర మంత్రుల వరకు రకరకాల ఆరోపణలకు గురికావటం ప్రతిపక్షాల నుంచి, ప్రజల నుంచి అయితే అది వేరు. కానీ కాంగ్రెస్ పార్టీకే చెందిన సీనియర్ నాయకులు ఆరోపణలు చేస్తుంటే? అందులో అవినీతి ఆరోపణలు కూడా ఉంటే? ప్రతిపక్షాలు, ప్రజలు చేస్తున్నటువంటి అవినీతి ఆరోపణలే వీరి నుంచి కూడా వినవస్తే? అవి కేవలం పార్టీ పదవులు, ప్రాధాన్యతకు సంబంధించిన ఫిర్యాదులు అవుతే రాజకీయాల్లో ఇది మామూలే అనుకుని వదిలివేయవచ్చు. కానీ ఆర్థిక సంబంధమైన అవినీతి ఆరోపణలు కూడా అయితే? ఆ విధంగా ఏమి జరుగుతున్నదో ప్రస్తుతం మరొక రెండు చూస్తున్నాము. ఉదాహరణకు 22-ఏను పురస్కరించుకుని పరిపాలనాపరమైన గందరగోళం అటు ప్రజలను, ఇటు పాలనా వ్యవస్థను తీవ్రంగా కుదిపేస్తున్నది. అవినీతి ఆరోపణలు చెలరేగుతున్నాయి. అవి ముఖ్యమంత్రి వైపు కూడా తిరుగుతున్నాయి. అందువల్ల కలుగుతున్న అప్రతిష్ఠ నానాటికీ పెరిగిపోతున్నది. అటువంటి సంకటస్థితిలో ముఖ్యమంత్రి అయిన వ్యక్తి చేయవలసిందేమిటి? ఇక్కడ ఉండి పరిస్థితులను చక్కబెట్టాలి. కానీ, ముఖ్యమంత్రి చేసిందేమిటి? అంతా సంబంధిత మంత్రిపైన, ఆయన సంబంధిత అధికారులపైన నెట్టివేశారు. ప్రభుత్వాధినేత అర్జంటుగా రెండువారాల విదేశీ పర్యటనలకు వెళ్లారు. అది రసాభాస కావడంతో మధ్యలో తిరిగివచ్చారు. ఇందులో మన ఆశ్చర్యాన్ని మరింత పెంచేది ఇంకొకటి ఉన్నది. 22-ఏకు సంబంధించిన అవినీతి ఆరోపణలు సంబంధిత మంత్రిపై ముఖ్యమంత్రిపై కూడా వినవస్తున్నాయి. అవి నిజం కావొచ్చు, కాకపోవచ్చు. కానీ నిజమై ఉంటాయనే అనుమానాలు ప్రజల్లో కలుగుతున్నప్పుడు, సీతమ్మవలె అగ్నిప్రవేశం చేసి, విషయాన్ని పూర్తిగా నిగ్గుతేల్చి, అనుమానాలు నివృత్తి చేయటం ముఖ్యమంత్రికి, సంబంధిత మంత్రికి కూడా అవసరం. తను 19న ఢిల్లీలో జరిగిన పార్టీ సమావేశాల్లో పాల్గొని రాత్రికి తిరిగి వచ్చినట్టయితే వేరుగా ఉండేది. కానీ, ఇక్కడి ఇంత తీవ్రమైన సమస్యలను వదిలివేసి రెండు వారాలపాటు విదేశీయాత్రలకు సన్నాహాలు చేస్తే ఏమనుకోవాలి? అందుకు చెప్పున్న కారణం పెట్టుబడులను ఆకర్షించటం. కానీ, ఇంతవరకు చేసిన అటువంటి పర్యటనల్లో ఎంవోయూలకు మించి వచ్చిన వాస్తవ పెట్టుబడులు ఏమిటో అడిగినా చెప్పరు. అదీగాక, రాష్ట్రంలో తలెత్తిన అత్యవసర సమస్యలను కొలిక్కి తెచ్చిన తర్వాతనైనా పర్యటనలు పెట్టుకోవచ్చు. అదట్లుంచి, 22-ఏతోపాటు రాష్ట్రంలోని ఇతరత్రా భూముల చుట్టూ తిరుగుతున్న భారీ అవినీతి ఆరోపణలు, ప్రభుత్వ నిష్క్రియాపరత్వం నేపథ్యంలో, 19 నాటి ఢిల్లీ వర్కింగ్ కమిటీ సమావేశంలో పార్టీ అధినాయకత్వానికి ముఖ్యమంత్రి ఇచ్చిన ఒక హామీ అనివార్యంగా గుర్తుకువస్తున్నది. వచ్చే సంవత్సరం జరిగే ఏడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కోసం ఎటువంటి చేయూత అవసరమైనా ఇచ్చేందుకు తెలంగాణ కాంగ్రెస్ సిద్ధంగా ఉన్నదని ముఖ్యమంత్రి ప్రకటించినట్టు వార్తలు వచ్చాయి. చేయూత అంటే ప్రధానంగా ఆర్థిక వనరులని తెలిసిందే. ఏడు రాష్ట్రాల్లో గోవా, ఉత్తరాఖండ్, మణిపూర్ చిన్నవి. హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నది. భారీగా నిధులు అవసరమయ్యేవి యూపీ, పంజాబ్, గుజరాత్. మిగిలిన నిర్వచనాలు ప్రజలు చెప్పుకోవచ్చు. 22-ఏ వంటి కేసులను అట్లుంచి, అవినీతి ఎట్లా విజృంభిస్తున్నదో టి.జీవన్‌రెడ్డి వంటి నాయకుడు నిన్నటివరకు చెప్పగా, గతంలో, ఇప్పుడు కోమటిరెడ్డి సోదరుల నుంచి వింటున్నాము. వీరివలె ఇంకా పార్టీలోనే ఉన్న మరొక సీనియర్ నాయకుడు చిన్నారెడ్డి, టికెట్ల అమ్మకం ఆరోపణలు చేశారు. మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా అయితే సీరియల్ ఆరోపణలు చేస్తున్నారు. తమ జోలికి వస్తే 'గుట్టంతా విప్పుతా'నని ఆరోపణలు చేస్తున్నారు. ప్రభుత్వ బాధ్యుల గురించి ఏమి చూస్తున్నామో, అదే పార్టీ పరిస్థితిలో అంతే అధ్వానంగా కనిపిస్తున్నది. ఒకటి కుక్కమూతి పిందె దశకు క్షీణించినప్పుడు, రెండవ దాని పరిస్థితి కూడా అంతే కావడం అనివార్యం. కాంగ్రెస్‌లో గ్రూపు కలహాలు ఎప్పుడూ ఉన్నవేనన్నది తెలిసిందే. పార్టీ పదవులు, ప్రభుత్వ పదవులు, ప్రాబల్యాలు, పార్టీలో గతం నుంచి ఉన్నవారు, కొత్తగా వచ్చినవారు, పార్టీ కోసం కష్టించి పని చేస్తున్నవారు, డబ్బున్నవారు, పెద్ద కులాలు, చిన్న కులాల వంటి వివాదాలు కొత్తకాదు. ఇదంతా పార్టీలోని ప్రజాస్వామ్యానికి చిహ్నమని పార్టీ పెద్దలు సర్ది చెప్పగా, ప్రజలు కూడా అందుకు అలవాటుపడిపోయారు. కానీ అంత మాత్రాన కుక్కమూతి పిందెలురావు. ఇటువంటి పరిస్థితి గతంలో ఉండటానికి, ఇప్పటికి గల తేడాను గుర్తించకపోవటం పొరపాటవుతుంది. కొంతకాలం క్రితం వరకు ఇక్కడ ఉమ్మడి రాష్ట్రంతోపాటు కేంద్రస్థాయిలో బలమైన, సమర్థవంతమైన నాయకత్వాలుండేవి. కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వాలకు కూడా. కనుక, రాష్ట్రాల్లో ఈ తరహా సమస్యలు తలెత్తినప్పుడు



# నాన్‌స్టాప్ వినోదం

అల్లరి నరేష్ నటిస్తున్న ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్ 'రంభ ఊర్వశి మేనక'. చంద్రమోహన్ చింతాడ దర్శకత్వంలో రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం ట్రైలర్‌ను అగ్ర నటుడు నాగార్జున విడుదల చేశారు. హీరో సూరి (అల్లరి నరేష్) అభ్యర్థనతో భూలోకానికి దిగి వచ్చిన రంభ, ఊర్వశి, మేనక అనుకోని పరిస్థితుల్లో తమ దివ్యశక్తులను కోల్పోతారు.

ఈ ముగ్గురూ తన ఇంట్లోనే ఉండటంతో సూరికి ఎదురయ్యే ఇబ్బందులు, ఈ క్రమంలో జరిగే సంఘటనలతో ట్రైలర్ ఆద్యంతం హాస్యప్రధానంగా సాగింది. వెన్నెల కిషోర్ ఇంద్రుడి పాత్రలో నవ్వుల్ని పూయించారు. పురాణ నేపథ్యంలో, ఫాంటసీ అంశాల కలబోతగా ప్రేక్షకుల్ని రెండున్నర గంటలు నాన్‌స్టాప్‌గా నవ్విస్తుందని మేకర్స్ తెలిపారు. సురభి, రాశిసింగ్, విష్ణుప్రియ, ప్రిషాసింగ్, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: చైతన్ భరద్వాజ్, దర్శకత్వం: చంద్రమోహన్ చింతాడ.



# మహా సంగ్రామానికి నాంది

బాలీవుడ్ నటుడు అక్షయ్‌ఖన్నా అసురుల గురువు శుక్రాచార్యుడి పాత్రలో నటిస్తున్న హిస్టారికల్ చిత్రం 'మహాకాళి'. భూమిశెట్టి, శ్రియారెడ్డి, రోహిత్ సరాఫ్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి పూజ అపర్ణ కొల్లూరు దర్శకురాలు. ప్రశాంత్‌వర్మ క్రియేటర్‌గా వ్యవహరిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 8న ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం రిలీజ్‌డేట్ అనౌన్స్‌మెంట్‌తో పాటు గ్లింప్స్‌ను విడుదల చేశారు. ధర్మం, అధర్మం మధ్య నడిచే మహాసంగ్రామాన్ని ఆవిష్కరిస్తూ గ్లింప్స్ ఆకట్టుకుంది. శుక్రాచార్యుడి నాయకత్వంలో జరిగే ఈ యుద్ధం ప్రపంచ భవిష్యత్తునే నిర్ణయించేదిగా చూపించడం ఆసక్తిని రేకెత్తించింది. భారీ సెట్స్, విజువల్ ఎఫెక్ట్స్‌తో తెరకెక్కిస్తున్న 'మహాకాళి' చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుందని మేకర్స్ తెలిపారు.

# 1500 మంది డబ్బింగ్ కళాకారులతో ఆడిషన్స్?

ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వచ్చాక డబ్బింగ్ ప్రక్రియ సులభతరమైంది. భాష రానివారి వాయిస్‌ని కూడా నచ్చిన భాషలో స్పష్టంగా వినిపించొచ్చు. ప్రస్తుతం సినిమా వాళ్లంతా డబ్బింగ్ విషయంలో ఏఐని విపరీతంగా వాడేస్తున్నారు. అయితే.. దర్శకధీరుడు రాజమౌళి మాత్రం ఏఐని దూరంగా ఉంచారు. సంభాషణల్లో భావోద్వేగాలు సహజంగా ఉండాలంటే మనుషులతోనే మాట్లాడించడం శ్రేయస్కరమని ఆయన భావిస్తున్నారు. ఇతర భాషల్లో అనువదించే క్రమంలో కూడా ఇదే విధానాన్ని పాటించాలని ఆయన ఫిక్స్ అయ్యారు. మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'వారణాసి' 120 దేశాల్లో వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానున్న విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా 50 భాషల్లో ఈ సినిమాను విడుదల చేసేందుకు నిర్మాత కేఎల్ నారాయణ సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సాధ్యమైనంతవరకూ 'వారణాసి'లో ఓన్ వాయిస్‌లే వినిపించేలా రాజమౌళి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఒకవేళ ఏ పాత్రకైనా డబ్బింగ్ అవసరమైతే.. ఏఐతో కాకుండా వేరే వ్యక్తితో అయినా డబ్బింగ్ చెప్పించాలని ఆయన గట్టిగా నిర్ణయించారట. అందుకే ప్రస్తుతం 'రియల్ వాయిస్'లను వెతికే పనిలో ఉన్నారట రాజమౌళి. 50 భాషల్లో ఈ సినిమా విడుదల కానున్నది కాబట్టి, ఆయా భాషల్లో పట్టు ఉన్న 1500మంది డబ్బింగ్ కళాకారులతో ఆడిషన్స్ నిర్వహిస్తున్నారు. వారందరినీ పరిశీలించి, మ్యాచ్ అయ్యేవారితో డబ్బింగ్ చెప్పిస్తారన్నమాట. ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. కీరవాణి సంగీత దర్శకుడు.



# 'రాకా'లో లేడీ విలన్?

అల్లు అర్జున్ తాజా చిత్రం 'రాకా' నిర్మాణ దశ నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సైన్స్ ఫాంటసీ మూవీలో దీపికా పడుకోన్‌తో పాటు రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్, జాన్వీకపూర్ కథానాయికలుగా నటిస్తున్నారని తెలిసింది. కథావిస్తృతి దృష్ట్యా నలుగురు నాయికలకు చోటుందని చెబుతున్నారు. తాజాగా 'రాకా' ప్రపంచంలోకి మలయాళ భామ ఐశ్వర్యలక్ష్మి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలిసింది.

పూర్తి నెగెటివ్ షేడ్స్‌తో ఆమె పాత్ర సాగుతుందని, కథాగమనంలో కీలకంగా ఉంటుందని సమాచారం. పాన్ ఇండియా స్థాయిలో ప్రెస్టీజియస్ సినిమా కావడం, దర్శకుడు అట్లీ తన పాత్రను తీర్చిదిద్దిన విధానం నచ్చడంతో ఐశ్వర్యలక్ష్మి లేడీ విలన్‌గా కనిపించడానికి ఓకే చెప్పిందని అంటున్నారు. మరి ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే అధికారిక ప్రకటన రావాల్సిందే. త్వరలో హైదరాబాద్‌లో 'రాకా' కొత్త షెడ్యూల్ ప్రారంభంకానుంది. ప్రస్తుతం ఐశ్వర్యలక్ష్మి తెలుగులో 'సంబరాల ఏటిగట్టు' చిత్రంలో నాయికగా నటిస్తున్నది.



# సెకండ్ ఇన్నింగ్స్ పై రాజశేఖర్ ఏమన్నారంటే...!

సీనియర్ నటుడు డాక్టర్ రాజశేఖర్ తన కెరీర్‌లో సెకండ్ ఇన్నింగ్స్‌ను ఉత్సాహంగా ప్రారంభించారు. కథాబలం ఉంటే హీరో పాత్రలే కాదు, సహాయ నటుడిగా కనిపించడానికీ తాను సిద్ధమేనని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో ఆయన ఈ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఇటీవల విడుదలైన 'బైకర్' చిత్రంలో తన పాత్రకు ప్రేక్షకుల నుంచి లభిస్తున్న ఆదరణ పట్ల రాజశేఖర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై కథకు ప్రాధాన్యమున్న పాత్రలు వస్తే చేయడానికి వెనుకాడనని తెలిపారు. నటుడు ఎప్పుడూ నటుడే. మంచి పాత్ర దొరికితే తనను తాను నిరూపించుకోవడానికి సిద్ధంగా ఉంటాడు అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 60 ఏళ్లు దాటినా ఇప్పటికీ యంగ్‌గా, ఎనర్జిటిక్‌గా కనిపించడం వెనుక ఉన్న రహస్యాన్ని కూడా రాజశేఖర్ పంచుకున్నారు. క్రమశిక్షణతో కూడిన జీవనశైలే తన ఫిట్‌నెస్‌కు కారణమని చెప్పారు. ముఖ్యంగా పుచ్చకాయ, ఆపిల్, ఆరెంజ్ పండ్ల రసాల మిశ్రమాన్ని ప్రతిరోజూ తీసుకుంటానని, దీనితో పాటు క్రమం తప్పని వ్యాయామం తనలో శక్తిని నింపుతుందని వివరించారు. ఈ సెకండ్ ఇన్నింగ్స్‌లో తన భార్య జీవిత పాత్ర ఎంతో కీలకమని రాజశేఖర్ తెలిపారు. కెరీర్‌లోని ఒడిదొడుకులను అధిగమించడంలో ఒకరికొకరు అర్థం చేసుకుని అండగా నిలవడమే తమ బంధంలోని బలమని ఆయన పేర్కొన్నారు.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com